
హనీబీఎపి

అక్టోబర్-డిసెంబర్ 2007

# పల్లెసృజన

సంపుటి 2, సంచిక 2

మరుగున పడిన గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




A Voice of Creative Grassroots Innovators and Traditional Knowledge Holders

# 'హనీబీఏపి' ప్రగతి

'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ,. హనీబీనెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) సంస్థకు, మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలకు సంధానం చేయడం ఈ హనీబీఏపి సంస్థ మూలకార్యక్రమం.

నవంబర్ 2005లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.ఎల్. రావు గారు, శ్రీ పి. చంద్రకాంత శర్మల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా, గారిని ఆదర్శంగా, వారి మహత్తర సృజనాత్మక ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమైన హనీబీఏపి 'ఇంతింతై వటుడింతై....' అన్నట్టుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడు వచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరి తోడు శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టిన, సాధించిన వివిధ కార్యక్రమాలు :

- ◆ 63 మంది తెలుగు ఇన్నోవేటర్స్‌ను వెలుగులోకి తెచ్చి వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్.ఐ.ఎఫ్.లో రిజిష్టర్ చేయడం జరిగింది.
- ◆ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామికవేత్తలకు అందించి, ఆర్థికపరంగా ఒప్పందం కుదర్చటం.
- ◆ నలుగురు ఇన్నోవేటర్స్‌ను అహమ్మదా బాద్‌లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం, వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.
- ◆ వందలకొద్దీ తెలుగు ప్రజలతో టెలిఫో న్‌లో హనీబీ గురించి చర్చించడం, వారికి తెలియజేయడం.
- ◆ గ్రామ ప్రజల సృజనాత్మక ఆవిష్కరణ లపై రీసర్చ్ చేస్తున్న వారికి సహకరిం చడం.
- ◆ గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 5వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి వందకు పైగా ఎంట్రీలు పంపబడ్డాయి.
- ◆ గ్రామీణ ఇన్నోవేటర్లకు ఉచిత సాంకేతి క మార్గదర్శకత్వానికి ముందుకు వచ్చిన ఎన్.ఐ.టి. వరంల్‌తో సంధా నం ద్వారా అయిదుగురు ఇన్నోవేటర్లకు లాభం చేకూరింది.
- ◆ పారిశ్రామిక వేత్తలు, అనధికార సంస్థలతో రాష్ట్ర ఉన్నతాధికారులు పద్మశ్రీ అనిల్ గుప్తా సమక్షంలో 12 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు.
- ◆ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుట కు, టెస్టింగ్‌కు టి.ఇ.పి.పి. ద్వారా రూ.4 లక్షల ఆర్థిక సహాయం.
- ◆ జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శన, కారంచేడు లో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.
- ◆ నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధ యాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను కలుసుకుని వారి సృజనలను గురించి తెలుసుకోవటం.
- ◆ ఇప్పటివరకు 5 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.
- ◆ టి.ఇ.పి.పి. ఛైర్మన్ డా. ఎ.ఎస్. రావు గారితో 16 మంది ఇన్నోవేటర్లతో ముఖాముఖి ఏర్పాటు చేయడం జరిగింది.
- ◆ దూమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.
- ◆ హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.
- ◆ జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.
- ◆ ఫిబ్రవరి 2008లో మహబూబ్‌నగర్ జిల్లా ఉత్తనూరు వ్యవసాయ ప్రదర్శనలో సంప్రదాయజ్ఞానం తమ అన్వేషణలను ఇన్నోవేటర్లు రైతులతో పంచుకున్నారు.

ఈ స్థాయికి రావడానికి సంపూర్తిగా సహకరించిన ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారికి, ఎన్.ఐ.ఎఫ్. అహమ్మదాబాద్ సంస్థలోని ప్రతి ఒక్కరికి, పాత్రికేయులకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వేతర సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు, సృజనాత్మకత కలిగిన తెలుగు ప్రజలకు హనీబీ కృతజ్ఞతలు.


**మా కలలు :**

- ◆ ఆరవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- ◆ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి బహుమతులు రావాలని మనసారా ఆశించడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి – ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**– బ్రిగేడియర్ గణేశం,** కో–ఆర్డినేటర్,
హనీబీఏపి, ఫోన్ : 98660 01678

## హనీబీఏపి సారథులు



**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**



**డా॥ కె.ఎల్. రావు**



**శ్రీ పి.సి. శర్మ**

# పల్లె సృజన

సంపుటి 2, సంచిక 2 అక్టోబర్ - డిసెంబర్ 2007



**సంపాదక వర్గం**

సంపాదకుడు :

**డా. కె.ఎల్. రావు**

ఉప సంపాదకులు :

**శ్రీమతి అరుణ గణేశం**

సలహాదారులు :

**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**డా. వై.వి. రావ్**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్
ఫోన్ : 040-30627739
సెల్ : 93913 75655, 92468 20655

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన - శ్రీమతి పి. అరుణ
102, వాయుపురి, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com


## ఈ సంచికలో....


| | |
|---|---|
| మట్టిలో మాణిక్యం ఏకలవ్యుడు రాంబాబు | 3 |
| సృజనాత్మక ప్రణాళికతో సిరులు పండిస్తున్న రోశిరెడ్డి | 5 |
| గ్రామీణ జ్ఞానపిపాసి ప్రొ. అనిల్ గుప్త | 6 |
| పల్లె సీమల్లో ప్రకృతి వైద్యం | 9 |
| నలుగురు ఆడే చదరంగం | 10 |
| రైతుల పాలిట వరం వెంకటకృష్ణ సృజనాత్మక సృష్టి 'సంజీవిని' | 11 |
| ఉత్తనూరు గ్రామీణ వ్యవసాయ ప్రదర్శన | 12 |
| దొంగలను పట్టించే సెల్‌ఫోన్ అలారం కాల్ | 13 |
| కొత్తగూడెంలో విద్యార్థుల ఇన్నోవేషన్ క్లబ్బుల ప్రారంభం | 14 |
| మన చుట్టూ ఉన్న మొక్కలతో ఆరోగ్య రక్షణ | 16 |
| ఉత్తర భారతంలో హనీబీ కాశ్మీరు శోధయాత్ర | 20 |
| గ్రామాల్లో మురుగునీటిని అరికట్టవచ్చు! | 22 |
| విశాఖ సైన్స్ కాంగ్రెస్ అనుభవాలు | 24 |
| పల్లె ప్రతిభకు పట్టం - హైదరాబాద్ హార్టికల్చర్ షో | 26 |
| స్పందన | 28 |


**కవర్ లోపలి పేజీల్లో.....**


హనీబీఏపి ప్రగతి

సైకిల్‌పై మనుషుల విన్యాసాలు కాదు - సైకిల్ విన్యాసాలు



## Honey Bee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : Dr. K.L. Rao, on behalf of "Honey BeeAP" 102, Vayupuri, Secunderabad - 500 094. A.P. Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.

# సంపాదకీయం

'పల్లెసృజన' ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాల్లోకి చొచ్చుకపోతున్నందుకు సంతోషంగా ఉన్నది. చందాదారుల సంఖ్య కూడా పెరుగుతున్నది. ఈమధ్య హైదరాబాదులో జరిగిన 'ఉద్యానవన ప్రదర్శన'లో గ్రామీణ ఆవిష్కర్తలు ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది. ఆ సందర్భంలో దాదాపు 64 మంది 'పల్లెసృజన' చందాదారులుగా చేరారు. ఇది మాకు చాలా సంతృప్తినిచ్చింది.

అంతేగాక ఇప్పటివరకు వెలుగులోకి తేబడ్డ ఆవిష్కర్తలకు గుర్తింపు లభించి, వారికి కావలసిన ప్రోత్సాహకాలు కూడా లభిస్తున్నవి. అయితే గడచిన మూడు, నాలుగు మాసాలుగా ఆవిష్కర్తలను గుర్తించే కార్యక్రమాలు కొంచెం మందకొడిగా సాగుతున్నట్లు అనిపిస్తున్నది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి మనందరి సమిష్టి కృషి చాలా అవసరం. ఇది దృష్టిలో వుంచుకొని 'హనీబీఏపి' ఈమధ్య విద్యార్థి క్లబ్బులను ఏర్పాటు చేసే ప్రణాళికను రూపొందించింది. ఇలాంటి విద్యార్థి క్లబ్బులు కొత్తగూడెంలో మూడు, విశాఖ పట్నంలో ఒకటి స్థాపించడం జరిగింది. ఈ క్లబ్బుల ద్వారా 'హనీబీఏపి' కార్యక్రమాలు విస్తరింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నవి. ఈ కార్యక్రమాల్లో ఆసక్తిగల విద్యార్థులు క్లబ్బులను ఏర్పాటు చేసుకొని మాకు తెలిపితే వారికి కావలసిన ప్రణాళికలు, చేయవలసిన కార్యక్రమాల వివరాలు 'హనీబీఏపి' అందజేస్తుంది.

మరొకమాట, ఆవిష్కర్తలను గుర్తించి, వారి ఆవిష్కరణలను వెలుగులోకి తెచ్చి, వాటికి తగిన విలువ కట్టి, ఆవిష్కర్తలకు ఇతోధిక సహాయం లభింపజేసే వరకు ఎన్నో దశలుంటాయి. వాటన్నింటిని అధిగమించడానికి ఎన్నో ఆర్థికపరమైన అవసరాలుంటాయి. అట్టి వాటన్నిటిని జాతీయ స్థాయిలో పనిచేసే యన్.ఐ.ఎఫ్. సంస్థ తీర్చలేదు. కనుక మన కార్యక్రమాలకు కావలసిన ఆర్థిక వనరులు మనమే సమకూర్చుకునే ఆలోచనలు చేసి వనరుల సమీకరణకు వినూత్న పద్ధతులను రూపొందించుకుంటే 'హనీబీఏపి' కార్యక్రమాలను ముందుకు నడిపే ప్రణాళికలకు తగిన పరిష్కారం లభిస్తుంది.

ఇందుకుగాను 'హనీబీఏపి' సభ్యులు, 'పల్లెసృజన' చందాదారులు, చదువరులు ఈ దిశగా ఆలోచనలు జరిపి తగిన సూచనలిచ్చి అన్ని విషయాల్లో పాలుపంచుకోవాలని మా విజ్ఞప్తి.

శుభాభినందనలతో...

**డా॥ కె.ఎల్. రావు,**

ఎడిటర్.

## గ్రామీణ సృజనా శక్తి వేదిక 'పల్లెసృజన'

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాము. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం.

**-సంపాదకవర్గం.**

స్వయంకృషి

# మట్టిలో మాణిక్యం ఏకలవ్యుడు రాంబాబు




*– పార్థసారథి, సింగరేణి కాలరీస్, కొత్తగూడెం.*

శ్రీ తేజావత్ రాంబాబు బిల్లుడుతండా అనే కుగ్రామంలో జన్మించాడు. ఈ గ్రామం ఇల్లందు రహదారిలోని బొమ్మనపల్లి అనే గ్రామం నుండి సుమారు 5 కి.మీ. దూరంలో గల అడవి ప్రాంతంలోనిది. ఈ గ్రామంలో ప్రాథమిక పాఠశాలగాని, ప్రభుత్వ వైద్యశాలగాని లేవు. రాంబాబు గ్రామంలోని వీధిబడిలో 2వ తరగతి వరకు చదివి తరువాత "కొండంగులబోడు" గ్రామంలో 3వ తరగతి అతి కష్టంమీద చదవగలిగాడు. ఆర్థిక స్థోమత లేక చదువుకు స్వస్తి పలకవలసి వచ్చింది.

ఇతనికి స్క్రూడ్రైవర్, రెంచి, పట్టుకుని పనిచేసే కరెంట్ మేస్త్రీ అన్నా, మోటార్ మెకానిక్ అన్నా చాలా ఆదర్శం. తన గ్రామంలో నివసించే రైతుల కష్టాలు చూసి, వారికి ఏదోవిధంగా సహాయపడాలనే ఆశయంతో వుండేవాడు. వారి కష్టాలను తగ్గించడానికి ఇంజనీర్లు సైతం ఆలోచించలేని విధంగా ఎన్నో సులువైన మార్గాలు అన్వేషించి కనిపెట్టాడు. ఇదంతా తన ఊహాశక్తి, సృజనాత్మక శక్తితో చేసిందే.

తల్లి, తండ్రి అయినా సక్కు, భీక్యాలు ఆర్థిక స్తోమత లేక తమ పుత్రుడైన రాంబాబుకు ఎటువంటి సహాయం చేయగలిగే స్థితిలో లేక చిన్నతనం నుండి పొలంలో పనికి తీసుకుపోయే వారు. తల్లిదండ్రులతో పొలం పనులు చేసుకుని కాలం వెళ్లదీస్తున్న రాంబాబుకి వాళ్ళ పెదనాన్న కొడుకు లాలు తారసపడ్డాడు. లాలు వాళ్ళింటికి వచ్చినపుడు తాను కొత్తగూడెంలో పని చేసే మెకానిక్ షెడ్ గురించి, అక్కడి రిపేర్ల గురించి, వచ్చే కార్లు, జీపుల గురించి చెప్పే కబుర్లు విని రాంబాబు మనస్సులో వాటి గురించిన ఆసక్తి పెరిగింది. తాను కూడా రెంచి పట్టుకుని షెడ్లో పని చేయాలని ఆశపడ్డాడు. అనుకున్నదే తడవుగా లాలూ సహాయంతో కొత్తగూడెంలోని ఒక షెడ్లో చేరాడు. కాని షెడ్ మేస్త్రీ పని చేయించుకుని సరిగా డబ్బులు ఇచ్చేవాడు కాదు. అందువలన అక్కడ ఉద్యోగం మానేసి ఎవరో చెప్పగా హైదరాబాద్ వెళ్ళి ఇసిఐఎల్ ప్రాంతంలోని ఒక మెకానిక్ షెడ్లో చేరాడు. కొన్నాళ్ళు పని నేర్చుకుని యజమాని ఇచ్చే జీతం చాలక తానే సొంతంగా షెడ్ పెట్టుకోవాలనే పట్టుదలతో ఇంటికి తిరిగి వచ్చాడు. తమ మండల కేంద్రమైన టేకులపల్లిలో షెడ్ ప్రారంభించి పని చేయటం మొదలు పెట్టాడు. పంప్లు, మోటార్ బైక్లు, జీపు, కార్లు రిపేరింగ్లో అనుభవమైతే వచ్చిందికాని, అక్కడ అందరూ చాలా వరకు తెలిసిన వారే కాబట్టి డబ్బులు రేపో మాపో యిస్తామని పనిచేయించుకుని పనికి తగ్గ ప్రతిఫలం ఇవ్వకుండా వెళ్ళేవారు. దీంతో రోజు గడవడం కష్టమయింది. ఇలా రెండు సంవత్సరాలు చూసి లాభం లేదని షెడ్ మూసేసి ఇంటిదగ్గర ఆయిల్ ఇంజన్లు రిపేరు చేసుకుంటూ గడిపేవాడు.




కొంతకాలం తరువాత గ్రామ పంచాయితీ అయిన బొమ్మనపల్లిలో ఎలక్ట్రానిక్ షాప్ పెట్టి టివి. రిపేరింగ్ మొదలు పెట్టాడు. టివి గురించి ఏమీ తెలియకపోయినా చేయగలననే ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాడు. మొదటిసారిగా రిపేర్కు వచ్చిన టివిని విప్పి చూస్తే తనకున్న అనువాన్ని బట్టి ఒక పార్టు కాలిపోయినదని తెలిసింది. ఆ పార్టును పట్టుకుపోయి స్పేర్పార్ట్ల షాప్లో దానిని గురించి అన్ని వివరాలు తెలుసుకొని దానితో పాటు అక్కడున్న అన్ని పరికరాల గురించి తెలుసుకొని దానిని టీవీలో వాడి చూస్తే మామూలుగా పనిచేయటం మొదలు పెట్టింది. ఈ విధంగా ఒక దాని తరువాత ఒకటిగా అన్ని పార్టుల గురించి తెలుసుకుని కొన్ని నెలల్లో ఎటువంటి రిపేర్ అయినా అవలీలగా చేయగల ప్రావీణ్యాన్ని సంపాదించాడు. చిప్స్, ట్రాన్సిస్టర్స్, కెపాసిటర్స్ గురించి తెలియని అజ్ఞాని అయిన రాంబాబు ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరు, స్వంత

ప్రజ్ఞ, సహజంగా వచ్చిన సృజనాత్మక శక్తితో ఎంతో నైపుణ్యతతో చేయగలగడం అద్భుతమే కదా!! అందుకే రాంబాబును 'ఆధునిక ఏకలవ్యుడు' అనడం సమంజసమే. !

రాంబాబు ఆయిల్ పంపు మోటార్లను కూడాబాగా రిపేర్ చేసేవాడు. అటువంటి సమయంలో పంపుసెట్లకి ఆయిల్ మోటార్లకి బదులు కరెంటు మోటార్లు వచ్చాయి. వాటి సంగతి ఏమీ తెలియని రాంబాబు ఎలాగైనా వాటి సంగతి తెలుసుకో వాలని ఒక పని చేయని మోటారు విప్పి చూసాడు. అందులో కాపర్ వైర్ కట్టలు కట్టలుగా అల్లి వుండటం గమనించాడు. దాన్ని వైండింగ్ అంటారని కూడా తెలియదు. అది కాలిపోయినది గా గమనించి మరల వైండింగ్ చేయించి వాడితే మోటార్ మామూలుగా పనిచేయటం జరిగింది. అంతటితో వైండింగ్ గురించి పూర్తిగా తెలుసుకుని రీవైండింగ్ చేయటంలో కూడా అనుభవం సంపాదించాడు.

సామాన్యంగా రైతులు పగలంతా కష్టపడటం, సాయంత్రం అంతో ఇంతో మద్యపానం చేయటం పల్లెల్లో పరిపాటి. రైతులు సాయంత్రాల్లో పొలాల్లో పంపు స్టార్టు చేయటానికి చాలా అవస్థ పడటం రాంబాబు గమనించాడు. ముఖ్యంగా వానాకాలంలో తడిసివున్న మోటారును స్టార్టు చేయబోతే చాలా మంది షాక్‌కు గురయ్యే ప్రమాదం వుందని రాంబాబు గమనించాడు. దీనికి కారణం తాగిన మత్తులో వేలు ఒకచోట పెట్టబోయి మరోచోట పెట్టి స్విచ్ ఆన్ చేయటానికి ప్రయత్నించటం, తరువాత షాక్ – ఇవన్నీ రాంబాబు చూసి వాటినుండి వాళ్ళను ఎలాగైనా కాపాడాలని తాను చాలా కృషి చేయాలని తీర్మానించుకున్నాడు. ఈ నేపథ్యంలో వారి గ్రామంలో ఒక రైతు వానలో తడిసిన మోటార్‌ను ఆన్ చేయటానికి భయపడి కర్ర సహాయంతో స్విచ్ ఆన్ చేయబోయి షాక్ తగిలి పెద్ద ప్రమాదంలో చిక్కుకోవడం రాంబాబు మనస్సును చాలా బాధ పెట్టింది. దీనికోసం రాత్రింబవళ్ళు ఆలోచించి చివరకు మోటార్ సర్క్యూట్‌లో సౌండ్ సెన్సర్స్ వాడి చప్పట్లతో మోటారును ఆన్ చేయటం కనుగొన్నాడు. అలా రాంబాబు రైతుల మనస్సులో మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు.



రాంబాబు ఆలోచనలు ఇంకా ముందుకు సాగాయి. బైకులకు, కార్లకు ఉపయోగించే రిమోట్‌ను బిగించి దాని ద్వారా సుమారు 60 మీటర్ల దూరం నుండి మోటార్‌ను ఆన్ ఆఫ్ చేయవచ్చని కనిపెట్టాడు. ఇది విజయవంతమైన తరువాత రాంబాబుకి క్రొత్త ఆలోచనలు రావటం మొదలైంది. వాటికి కార్యరూపంగా 'సెల్‌ఫోన్' ద్వారా మోటార్‌ను ఆన్ – ఆఫ్ చేసే పద్ధతి కనిపెట్టాడు. ఎంత దూరంనుంచైనా సెల్‌ఫోన్ రింగ్ ఇస్తే పొలంలో మోటార్ ఆన్ చేసే పద్ధతి కనిపెట్టాడు. అంతే కాకుండా ఇక్కడ రింగ్ ఇచ్చాకే అక్కడ పొలంలో మోటార్ ఆన్ అయిందో లేదో తెలుసుకునే పద్ధతి కూడా కనిపెట్టాడు. నాలుగుసార్లు రింగ్ అయ్యే వరకు సెల్‌ఫోన్‌ను ఆన్‌లో వుంచి వింటే మోటార్ నడుస్తున్న శబ్దం, నీళ్ళు పడే శబ్దం చక్కగా వినబడతాయి. అంతే కాకుండా మోటార్ సర్క్యూట్‌కి ఇంకో పరికరాన్ని అమర్చి దాని సహాయంతో మోటార్‌కు 3 మీటర్ల సమీపంలో ఎవరైనా వస్తే సైరన్ మ్రోగటంతో పాటు అందులో ఫీడ్ చేసిన యజమాని ఫోన్ నెంబరుకు కాల్ వెళ్ళే ఏర్పాటు చేసాడు. దీనివల్ల మోటార్ దొంగలు భయపడి పారిపోయే అవకాశం వుంది. ఇలా చేసినా దొంగ ధైర్యంగా మోటార్‌పై చేయి వేసి దొంగతనం చేయబోతే మోటార్ పట్టుకోగానే చిన్నపాటి షాక్ కొట్టే ఏర్పాటు కూడా చేసాడు. వచ్చిన వ్యక్తి షాక్‌కు భయపడి పారిపోయేలా దాన్ని రూపొందించాడు. ఇప్పుడు బిల్లుడు తాండా, దాని చుట్టుప్రక్కల గ్రామాల్లోని రైతులు ఇంటివద్దనుండే రాత్రిళ్ళు వాళ్ళ పొలాల్లోని మోటారు సెల్‌ఫోన్ సహాయంతో నడుపుకుంటున్నారు.

అంతే కాకుండా ఎక్కువ తక్కువ ఓల్టేజి వల్ల కరెంటు మోటార్లు కాలిపోకుండా వుండటానికి గాను ట్రాన్స్‌ఫార్మర్స్‌తో ఆటోమాటిక్‌గా స్టార్టర్ కూడా తయారు చేసి కావలసినంత కరెంట్ మాత్రమే సప్లయ్ అయ్యే విధంగా తయారు చేశాడు. అంతే కాకుండా నీరు మోటారుకు అందనప్పుడు మోటార్ నడవకుండా ఆగిపోయేట్లు కూడా తయారు చేశాడు. రాంబాబు తయారు చేసిన ఈ సిస్టమ్ పొలాల్లో మోటార్లకే కాకుండా ఇళ్ళలో, ఆఫీసుల్లో వాటికి కూడా ఉపయోగపడే విధంగా వుంటుంది.

తేజావత్ రాంబాబు భార్య సరోజ, భర్తకి అన్ని విషయాల్లో సహకరిస్తుంది. వీరికి ఇద్దరు పిల్లలు బన్సీలాల్, వంశీలాల్. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా చేయాలని వారి ఆశ. అందుకు ఉపయోగపడే ఎన్నింటినో కనుక్కోవాలని రాంబాబు ఆశయం. దానికి తగిన సహాయ సహకారాలు అతనికి అందాలని ఆశిద్దాం.

బ్రిగేడియర్ (రిటైర్డ్) గణేశం ఈమధ్య ఇతని గురించి తెలుసుకుని రాంబాబు గ్రామం వెళ్ళి అతను తయారు చేసిన వాటన్నింటినీ చూసి చాలా ఆశ్చర్యపడ్డారు. ఇన్నోవేషన్స్ గురించి అన్వేషిస్తున్న బ్రిగేడియర్ గారు రాంబాబును ఎంతో మెచ్చుకుని ఎలాగైనా అతనిలోని సృజనాత్మకతను వెలికి తీయాలని గట్టి సంకల్పంతో వున్నారు. దీనికి హనీబీఏపి, ఎన్ఐఎఫ్ సంస్థలు తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నాయి. ●

**"రాంబాబు లాంటి ఏకలవ్యులు మన రాష్ట్రంలో ఎంతోమంది ఉన్నారు. వారిని వెలుగులోకి తీసుకురావడం మనందరి బాధ్యత. ఇలాంటి సృజనాత్మక వ్యక్తులు, స్త్రీలు, బాలురు మీ దృష్టిలో ఎవరైనా కనిపిస్తే మాకు వారి పేరు, అడ్రస్ కొన్ని వివరాలు తెలియజేస్తూ వ్రాయండి. హనీబీఏపి వాలంటీర్లు వారి ఊరికి వచ్చి మిగతా వివరాలు సేకరిస్తారు. రాంబాబు లాంటి గ్రామీణ మేధావులను వెలుగులోకి తీసుకు రావడానికి సదా కృషి చేద్దాం."**

**- ఎడిటర్**


ఆదర్శ రైతు

# సృజనాత్మక ప్రణాళికతో సిరులు పండిస్తున్న రోశిరెడ్డి

*- **శ్రీమతి అఫ్జల్ బేగం**, వ్యవసాయ అధికారిణి, కొత్తగూడెం.*



కూలీల కొరత, పండించిన పంటకు సరియైన గిట్టుబాటుధర లభించకపోవడం వలన ఈ రోజుల్లో వ్యవసాయం చేయడం చాలా కష్టతరమై పోతున్నది. నేడు రైతులు సరియైన ప్రణాళిక లేకుండా, తోటి రైతులను అనుకరిస్తూ, అత్యాశతో అప్పుల్లో కూరుకుపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పది పదిహేను ఎకరాలున్న మోతుబరి రైతులే వ్యవసాయం చేయడం కష్టము అంటున్న ఈ రోజుల్లో ఖమ్మం జిల్లా కొత్తగూడెం మండలంలోని వేవలగడ్డ గ్రామానికి చెందిన రోశిరెడ్డి కేవలం రెండు ఎకరాల ఆసామి, సన్నకారు రైతు "నేనె వరికీ తీసిపోను" అంటూ ఒక ప్రణాళికతో లక్షలు ఆర్జిస్తున్నాడు. అంతేగాక నూతన ఒరవడితో వ్యవసాయం చేపట్టాడు. "బోడ కాకరకాయ" సాగుతో లక్షల ఆదాయం గడిస్తున్నాడు. బోడ కాకరకాయ – ఇది అడవిలో దొరికే కూరగాయ అని అందరికీ తెలుసు. కానీ ఈ పంటను పట్టణంలో కూడా పండించవచ్చు అని నిరూపించాడు రోశిరెడ్డి. కొన్ని విత్తనాలను తన చేలో నాటి, తీగలు వచ్చాక తీసి ఎడమగా నాటాడు. ఇందులో పదిశాతము పూత వచ్చింది. అందులో కేవలం ఒకటే తీగ కాయలు కాసింది. ఈ కాయలను ఎండే వరకు ఉంచి విత్తనము కట్టి మళ్లీ ఆ విత్తనాలను నాటాడు. ఇప్పుడు కూడా కేవలం పదిశాతం మొక్కలకే పూత వచ్చింది. దీనికి పందిరి వేసి, తీగలు పాకించి మరల విత్తనాలు తీశాడు. ఈ విధంగా మూడు సంవత్సరాలు కష్టపడిన తర్వాత 25 తీగలు బ్రతికించగలిగాడు. అర ఎకరంలో ఎడమగా తీగలను పందిరి వేసి పాకించడము మొదలు పెట్టాడు. మొదటి సంవత్సరం పెట్టుబడి పోను రూ. 80 వేల నుండి లక్ష వరకు



ఆదాయాన్ని పొందగలిగాడు. బోడకాకర కాయకు కూరగాయలన్నింటిలోను ఎక్కువ ధర. కిలో రూ. 30-40 వరకు వుంటుంది. రోశిరెడ్డి ఏ కూలీలమీద ఆధారపడకుండా స్వయంగా భార్యా పిల్లలతో కలిసి కష్టపడి ఈ లాభాన్ని పొందుతున్నాడు.

ఈ రైతులో మరో ప్రత్యేకత కూడా వుంది. తనకున్న రెండు ఎకరాల భూమిలో నాల్గు రకాల పంటలు వేస్తాడు. అందరు రైతులకన్నా భిన్నంగా, అందరూ వేసే సమయంలో కాకుండా కాస్త ముందుగానైనా, తర్వాతనైనా తన పంట (కూరగాయలు) మార్కెట్లోకి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా పంట పండిస్తాడు. అంటే మార్కెట్లో మంచి ధర పలికేటప్పుడు తన కూరగాయలు మార్కెట్లోకి వచ్చేలా చూసుకుంటాడు. అంతే కాకుండా, రాత్రనక, పగలనక తన చేలో భార్యా, కొడుకుతో కష్టపడి లాభాన్ని పొందుతున్నాడు. మిగతా కొడుకులను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. రైతు ప్రతిరోజు తన పొలంలో పని చేయడం వలన పంటను ఆశించే చీడపీడలను స్వయంగా కనిపెట్టడమూ, వాటిని నివారించడానికి తగు జాగ్రత్తలు/చర్యలు తీసుకునే ఆస్కారముంటుంది. "రెండెకరాల పొలంలో వంగ, మిర్చి, కాలిఫ్లవర్, టమాట మరియు బోడకాకరకాయల్ని పండిస్తూ లక్షాధికారి అవ్వడము చాలా సంతోషంగా వుంది" అని రోశిరెడ్డి చెబుతున్నారు.


**రోశిరెడ్డి ఒక ఆదర్శ రైతు. ఆత్మ విశ్వాసం నిండుగావున్న వ్యక్తి. వినూత్న ప్రయోగాలు చేసి దిగుబడి వృద్ధి పరచిన రోశిరెడ్డికి పల్లెసృజన అభినందనలు తెలియజేస్తోంది. ఈ ప్రయోగాలను జాతీయ స్థాయిలో చేర్చడానికి హనీబీఏపి సంకల్పించింది. ఎన్ఐఎఫ్ సహకారంతో ఇది త్వరలోనే సాధ్యమవుతుందని ఆశిస్తున్నాము -ఎడిటర్.**


వ్యవసాయ అధికారిణి శ్రీమతి అఫ్జల్ బేగం తో .....


ఆదర్శ రైతు రోశిరెడ్డి

ఆదర్శం

# గ్రామీణ జ్ఞానపిపాసి ప్రొ. అనిల్ గుప్త



అబ్దుల్ రషీద్ దార్ అనే అతను తన చేతులతో మరియు అగ్గిపుల్లల వంటి కాళ్ళతో దుమ్ము, ధూళి కూడిన ప్రదేశములో దీనావస్థలో వెనుకబడి వున్నాడు. గ్రామీణులు, పాఠశాల దుస్తులు ధరించిన విద్యార్తులు ఒక గడ్డము పెంచుకొని విద్యావంతునివలె వున్న మనిషి దార్‌ని ఎత్తుకొని కౌగలించుకుని కుర్చీలో వుంచడం గమనించారు. అతను చల్లని చిరునవ్వుతో ఈపని చేశాడు.

మేము కాశ్మీరులోని 'షంగాస్' అనే పల్లెలో వున్నాము. అక్కడ దార్ అనబడే వ్యక్తి ఎప్పుడూ పాఠశాలను చూడనివాడు, దర్జీపని చేసుకునే అతను బహు ప్రజాసమక్షంలో శ్రీ అనిల్ గుప్తా, మహోపాధ్యాయుడు సుదూరమైన అహమ్మదాబాద్ నుండి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ తరుపున అభినందించడానికి వచ్చినారు. "ఎందుకు?" పోలియో బాధితుడైన దార్ తన పాత కారు 'క్లచ్ ఫెడల్'ను చేతితో నడిపే విధంగా (పోలియో బారినపడిన వారికి) ఒక పరికరాన్ని తయారు చేశాడు.

ఈ విశేష యంత్ర పరికరము ఇనుప గొట్టముతో కొన్ని నట్లు, బోల్టులతో తయారు చేశాడు. దీని ధర దాదాపు రూ. 100/–లు మాత్రమే. కారు తయారీదార్లు అతను కొన్న ధరకంటే అధికంగా కొంత చెల్లించి రూ. 80,000/–ల పరికరములను తయారు చేయవలసిందిగా కోరారు.

ఇప్పటివరకు నన్ను ఎవరూ అభినందించలేదు. 49 సం.ల వయసుగల దార్ ఇప్పుడు తన సృజనాత్మకతకు లభించిన సన్మానానికి అత్యంత సంతోషంతో వున్నాడు. నేను చాలా చాలా ఆనందంగా వున్నాను. కాశ్మీరులోని అనంతనాగ్ జిల్లాలో నేను గుప్తా గారితో కలసి అనేక పల్లెలు తిరిగాను. మేము రోజుకు దాదాపు 25 కి.మీ. పాదయాత్రల ద్వారా, వసతులు లేని పాఠశాల గదులలో, సిమెంటు బల్లలపై నిద్రించాము. మంచునీటి సెలయేరులలో స్నానాలు ఆచరించాము. శ్రీ గుప్తాగారు 55 సం.ల వయసులో కూడా ఎటువంటి నిరుత్సాహానికి గురి కాకుండా ఎవరూ వెళ్ళడానికి నిరాకరించే ప్రదేశాలకు కూడా వెళ్ళి అక్కడి సృజనాత్మకతను వెలికి తీసి పలు విషయాలు తెలుసుకుని ఇతరులకు తెలియజెప్పి, వాటిని పెంపొందించడానికి కృషి చేస్తున్నారు. ఇది వారి జీవితాశయము.

> గుప్తా గారి కృషి, **మానవాళికి అత్యంత విలువైన సహజ సంపద - ప్రజలు వారి ఊహలు** – ను అభివృద్ధి చేయడానికి తోడ్పడుతుంది.

గుప్తాగారు నవీన విషయాలతో పాటు, మన పురాతన సంప్రదాయాలపైన కూడా ఆసక్తి కలవారు. మన పాత తరాల వారి వ్యవసాయక అనుభవాలు ఉపయోగించిన సుళువు మార్గములు వనమూలికల పెంపకం ఇలాంటి వాటిపై

ఆయనకు మంచి అవగాహన వున్నది. ప్రస్తుత ఆధునిక వ్యవసాయం, రసాయన మందుల వాడకం వల్ల సమూలంగా నాశనం అవుతున్నది.

శ్రీ గుప్తాగారు గత 20 సం.లలో దాదాపు 65,000 మంధి సృజనాత్మకులను, సంప్రదాయ పద్ధతి ద్వారా పని చేయువారిని వెలుగులోకి తెచ్చారు. వీటిలో ఆవుపేడ ద్వారా విద్యుత్తును తయారు చేసి 'సెల్‌ఫోన్ చార్జరును పని చేయించడం, ఆలోనే అను మిశ్రమంతో జంతువుల విరిగిన కొమ్ములను అతుకు పెట్టడం వంటివి వున్నవి. బహుశా ప్రపంచంలో ఇటువంటి గ్రామీణ సమూహాన్ని తయారు చేయడం ఇదే ప్రథమం. అదియునూ ఏకతాటిపై పల్లెల విజ్ఞానాన్ని చూపడం.

గుప్తాగారి పనులు ఆసియాలోని థాయ్‌లాండ్ చైనా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ మరియు సౌతాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాలలో కూడా ప్రేరణ పొందినవి. యం.ఐ.టి. శాస్త్రవేత్త నీల్ గెర్షన్‌ఫెల్ట్ గుప్తాగారి చేతలను చూచి ఆయనను "ప్రపంచ గురువు"గా అభివర్ణించారు. అతి అమూల్యమైన వృక్ష సంపదను ప్రకృతిపరంగా పెంపొందించ దానికి వీరి పనులు దోహదం చేస్తాయని అభినందించారు.

మంజుమూ గ్రామంలో హజ్రా బేగం గారు గుప్తాగారికి అతిసారం నుండి కాపాడే మందు తయారు చేసే విధానం చెప్పుచున్నారు. ఒక గుడ్డును ఈ వనమూలికలతో కలుపి, దానికి ఉల్లిపాయల గుజ్జును కలపాలి అన్నారు. గుప్తాగారు తను వ్రాయుచున్నది ఆపి ఆమెను సందేహంగా అడిగారు. ఇది రహస్యమా? లేక నేను యితరులకు చెప్పవచ్చునా అని. అందుకు ఆమె ఆశ్చర్యంగా ఇది పలువురికి ఉపయోగ పడేదే, దాపరికం లేదు అన్నారు. గుప్తాగారి ప్రశ్న గుండెలను తాకుతుం దని, ఇదో క్రొత్త ఆలోచనలకు దారి తీస్తుందని ఊహించలేదేమో!

ఆయన 1980 మధ్య వరకు పేద, అవిద్యావంతుల గ్రామీణ వ్యవసాయం గురించి వ్యాసాల వరకే పరిమితమైనారు. ఆయనకు కొన్ని నిపుణ సంస్థల నుండి గుర్తింపు వచ్చింది. కాని, ఆయన వ్యాస ఫలితములు కార్యరూపంలోకి రాలేదు. దీని గురించి గుప్తాగారు వ్యాకులపడి ఈ అన్యాయాన్ని అరికట్టడానికి పూనుకున్నారు. ఆయన తన మిత్రులతోను సహచరులతోను సంప్రదించి ఈ క్రింది విధంగా చేయదలచారు.

1. ఎంత చిన్న విజ్ఞాన విషయమైనా దాని గుర్తింపు దానికి రావాలి.
2. దాని ఉపయోగం వారి అనుమతితోనే ఉపయోగించాలి.

**"షాపు పేరులోని 'ఆర్ట్' శబ్దం నన్ను కుతూహల పరిచింది. ఇక్కడ తప్పకుండా సృజనాత్మకమైన పనేదో వుంటుంది అని నేను నమ్మాను. నేను అనుకున్నన్నది నిజమైంది"**

3. తద్వారా వచ్చిన ఆదాయమును తదనుగుణంగా పంచుకొనవలెను.

గుప్తాగారు కూడా కొంతకాలం అందరిలాగే పల్లె ప్రజానీకం విద్యావంతుల మాటలు పాటిస్తే దేశం చాలా త్వరగా బాగుపడుతుందని నమ్మేక్మవారు. ఆయన గాంధీగారి అభిమాని. తద్వారా ఆయన పల్లెలోని సృజనాత్మకతను వెలికి తీస్తే ఎందుకు పురోగతి సాధించ లేమని అనుకున్నారు. కాని, ఆచరణలో ఇది అతి కష్టమైన పని. ఆయన ఐ.ఐ.యం. సహచరుడు విజయ్ షెరిచాంద్ అన్నట్లు ఒక్కసారి తలుచుకుంటే ఆయనను ఆచరణ విముఖున్ని చేయడం ఎవరికీ సాధ్యం కాదు.

గుప్తాగారు తన కార్యాచరణను వ్యవసాయ దారుల నుంచి మొదలుకొని, పరిపాలనా అధికారుల వరకు విస్తరించారు. గుప్తాగారు తన కార్య విభాగమునకు 'హనీబీ నెట్‌వర్క్' అని నామకరణం చేశారు. తేనెటీగల వలె ప్రాకృతమైన నిస్వార్థ సేవ – పరోపకారమే దీనికి ప్రేరణ.

శ్రీ గుప్తాగారి ప్రథమ 'నెట్‌వర్క్' ముద్రణ సాధారణ సైక్లోస్టైల్ పేపరుపై కొన్ని మాత్రమే 1990 మేలో తీయబడినవి. ఇవి వ్యవసాయ అవసరాలకు తగినవి. ఈరోజు చాలా సమాచారం ఉచితంగా ఇంటర్‌నెట్ ద్వారా లభిస్తున్నది. గుప్తాగారు సంవత్సరానికి రెండుసార్లు ఏడు లేక తొమ్మిది రోజులు 'శోధయాత్ర' పల్లెలలో చేసి అక్కడి నూతన ఆవిష్కరణలు వెలికి తీసి వారికి సహాయ సహకారాలు అందిస్తారు.

శోధయాత్రలో ఎవరైనా పాల్గొనవచ్చు 45 మంది వున్న మా బృందంలో వ్యవసాయ దారులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఇస్రో శాస్త్రవేత్తలు మరియు ఆర్థిక సలహాదారులు కలరు. వెల్లూరిలోని చార్టెడ్ అకౌంటెంట్ ఎ. గౌతం సంఘీ గారు దీనిని భారతదేశం గురించి తెలుసుకునే ద్వారంగా పేర్కొన్నారు. ఆయనకు మూలికా ఔషధాలపైన మక్కువ ఎక్కువ.

వీర్‌నాగ్ పాదయాత్రలో గుప్తాగారు "శహబాద్ స్టీల్ ఆర్ట్ వర్క్స్" అనే దుకాణములో పరిశోధన కోసం ప్రవేశించారు. ఆ వర్క్‌షాప్ యజమాని అబ్దుల్ రహమాన్ షేక్. ఆయన పుత్రుడు ఇద్దరు సహాయకులు వున్నారు. వారు విద్యుత్తు శక్తితో పనిచేయు లోహపు గొట్టములను కోసే సాధనాన్ని తయారు చేసే పనిలో నిమగ్నమైనారు. షేక్ గారు ఇప్పటివరకు రూ. 5,000 లు పెట్టుబడి పెట్టినారు. కాని విద్యుత్ సరఫరా సమంగా లేనందున తన కార్యసాధన సాధించలేక పోయారు. గుప్తాగారు తన అనుచరునితో దానిని సమీక్షించి అందులో కొత్తదనం వుంటే ఋణ సహాయం చేద్దాము అన్నారు.

గుప్తాగారు బయటకు వస్తూ "షాపు పేరులోని 'ఆర్ట్' శబ్దం నన్ను కుతూహల పరిచింది. ఇక్కడ తప్పకుండా సృజనాత్మకమైన పనేదో వుంటుంది అని నేను నమ్మాను. నేను అనుకున్నన్నది నిజమైంది" అని నాతో అన్నారు.

గుప్తాగారికి చూసిన అన్ని విషయాలపై ఆసక్తి వున్నది. ఆయన వరి మధ్యలో చెట్లు వుండటం గమనించారు. వ్యవసాయదారుని అడిగితే అవి నీటిపారుదలను నియంత్రించడానికి అని మరియు నీటి త్రోవను రక్షించడానికి అని చెప్పినాడు. ఒక ఇంటిలో చెక్కతో నేల చేయ బడింది. ఆ ఇంటి వానికి సిమెంటు నేల పడదు. నడుము నెప్పులు వస్తవట.

కాశ్మీరులో శోధయాత్రకు బయలుదేరే వారం ముందు అహమ్మదాబాద్‌కు 100 కి.మీ. సమీపంలో ఆయనకు అతి చిన్న ట్రాక్టరు

కనిపించింది. గుప్తాగారు దానిని నిశితంగా పరిశీలించారు. రశిక్ మిస్త్రీ అనే అతని కుమారుడు బిపిన్ ఈ 6 హెచ్.పి. ట్రాక్టరును కారు గేరుబాక్సు, మోటార్ సైకిల్ ఇంజను అనుసంధానించి పవర్ టిల్లర్ టైర్లను కలిపినాడు. గుప్తాగారు దానిని నడిపినారు. తిరిగి వస్తూ 17 సం.ల బిసిన్ భుజంపై చేయివేసి నీవు వ్యవసాయ దారులకు మాత్రమే పని చేయకు కొత్త విషయాలు కనుగొని అతని తల్లికి, అమ్మమ్మకు సహాయ కారిగా వుండవలసిందిగా కోరినారు. స్త్రీలు నూతన ఆవిష్కరణ పరికరాలు వాడక పోవడం గుప్తాగారిని బాధిస్తున్నది.

కానీ గుప్తాగారు నిరాశ చెందలేదు. 1997లో ఆయన పలువురు నూతన ఉత్సాహవంతులకు సవాలు విసిరారు. ఎవరైనా ఆడవారికి సహాయపడే నీరు తోడే యంత్రాన్ని తయారు చేయమని. అది చాలా లోతు వరకు ఎక్కడ కావాలంటే అక్కడ బకెట్టు నిలిచి ఉండేటట్లు మరియు క్రిందకు జారకుండా వుండాలి. అమృతలాల్ అగర్‌వాల్ అనే వ్యక్తి 5వ తరగతితో చదువు ఆపేసిన అతను పుల్లీతో తయారు చేసిన పరికరాన్ని ఆవిష్కరించినాడు. అటువంటివి 500 వరకు వాడుకలో వున్నవి.

ఒక వస్తువును బజారులో అమ్మకానికి పెట్టడం అంత సులువైన విషయం కాదు. 'హనీబీ నెట్‌వర్క్' తన ప్రథమ దశలో కొంతవరకు మాత్రమే చేయగలిగినది. కాని 1990 దశకం చివరిలో ప్రభుత్వం నుండి కొంత సహాయము లభించడంతో చాలామంది లబ్ది పొందినారు.

అటువంటి వారిలో మన్‌సుఖ్‌భాయ్ పటేలు అనే వ్యక్తి వున్నాడు. ఆయన పత్తి పంట కోతలకు ఒక యంత్ర పరికరాన్ని తయారు చేసినాడు. 'హనీబీ' అతనికి ఆర్థికంగా సాంకేతికంగా సహాయం అందజేసింది. ఇప్పుడు మానవ శక్తి చాలావరకు లేకుండా పత్తిని సేకరించవచ్చు. ప్రస్తుతం అతని వ్యాపారం సం.నకు రూ. కోటి పైమాటే.

విదేశాల నుండి కూడా మన వారికి నూతన ఆవిష్కరణలు కొనుగోలుకు సుముఖత వ్యక్తమైనది. ఇందులో కొబ్బరి చెట్టు ఎక్కుటకు కావలసిన పరికరములు, వెల్లుల్లి పొట్టు తీసే సాధనం, పాలు పితికే సాధనాలు వున్నవి. గుప్తాగారి అనుచరుడు శ్రీ ఎల్. ఛింజా గారు ఈ ఆవిష్కరణలను ఇంకా ఆధునీకరించిన తరువాత నే విదేశాలకు పంపడం మంచిది అంటున్నారు.

కాశ్మీరులో ఆఖరి పర్యటన దినాన్ని 'శోధయాత్ర'లో అనంతనాగ్ లో గుప్తాగారు ఇలా అన్నారు. దీనిలో కొన్ని వందల మంది సహచరులు విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన యువతరం ఊహాశక్తిని పెంపొందించుకొని, యువతలోని సృజనాత్మక శక్తిని వెలుగులోకి తేవాలని ఆశించారు.

చివరిలో ఒక విద్యార్థి గుప్తాగారి వైపు గబగబా వచ్చాడు. అతను కొంత నిరాశా భావంతో వున్నట్లు కన్పించింది. గుప్తాగారు ఎందుకని అడిగితే, "మీరు ఇన్ని సంవత్సరాలు ఇక్కడికి ఎందుకు రాలేదు? అని అడిగాడు" తామింత కాలం ఏమి పోగొట్టుకున్నామో, పొందలేకపోయామో అన్న ఆతురత, సందిగ్ధత ఆ ప్రశ్నలో కనిపించాయి. ●

## హనీబీఏపి అంతరాత్మ పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించ బడింది. తేనెటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. పువ్వుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ కంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజల నుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించి నపుడు, వారు గరీబులుగా మారకూడ దు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నపుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనల్ని మన ముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతో కొంత ఆదాయాన్ని వారికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయివారిని చేస్తుంది. మనం ఎక్కడినుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ వుంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహి స్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయిన స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పేపర్ పైన వ్రాసి పంపడం (డాక్యుమెంటేషన్) ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాప్తిలోకి తేవడం, వాటికి సిద్ధాంత రూపాల్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తా రంగా వ్యాప్తి చేయడానికి 'పల్లెసృజన' తెలుగు నాట కృషి చేస్తున్నది. హనీబీఏపి యంత్రాంగానికి చేయూతనందించాలి. అనుకున్న ట్టయితే మీరు మా పత్రిక వార్షిక చందా లేదా జీవిత కాలపు చందాతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచారానికై పంపండి.

### చందా వివరాలు

| | వ్యక్తిగతంగా | సంస్థ లేదా లైబ్రరీకి |
|---|---|---|
| సంవత్సర చందా | 100/- | 1,000/- |
| జీవిత చందా (15 సంవత్సరాలు) | 1,000/- | 10,000/- |

**మీ చందాలను డి.డి. / మనీ ఆర్డర్ /చెక్కుల రూపంలో పంపవలసిన చిరునామా**

శ్రీమతి అరుణ గణేశం
అసోసియేట్ ఎడిటర్, పల్లెసృజన,
102, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27118555

సహజవైద్యం

# పల్లె సీమల్లో ప్రకృతి వైద్యం

*- డి. నాగమణి, తెలుగు ఉపాధ్యాయిని, చిన్మయ విద్యాలయం, బేగంపేట.*

అనాదిగా వస్తున్నది ఆయుర్వేద వైద్యము. ఈ వైద్యం ప్రకృతిలో లభించే ఆకులు, బెరడు, మూలికలు మొదలైన వృక్ష సంబంధ భాగాలలోను, పాదరసం, బంగారం మొదలైన లోహాలతోను తయారు చేస్తారు. ప్రచీనం నుంచి వస్తున్న ఈ వైద్యం అత్యంత ఉపయోగకరం.

పూర్వం ఆయుర్వేద వైద్యులు రోగి నాడిని చూసి అది ఏ వ్యాధో నిర్ణయించి, ఆ వ్యాధికి తగిన వైద్యం చేసి తినకూడని పదార్థాలు ఏవో, తినదగిన పదార్థాలు ఏవో తెలియపరచి, తగిన జాగ్రత్తలు సూచించేవారు. నేడు లక్షలు వెచ్చించి చదివిన వైద్యులు కేవలం 'టెస్టుల' మీద ఆధారపడి, ఆ టెస్టులు ఏవి సూచిస్తే దానికి తగిన వైద్యం చేస్తున్నారు.ఒక్కొక్క వ్యాధికి సుమారు నలుగురు, ఐదుమంది డాక్టర్లను సంప్రదించవలసిన అవసరం ఏర్పడుతోంది. అంతే కాకుండా వేలు, లక్షలు వెచ్చించవలసి వస్తోంది. ప్రతి దానికి ఆపరేషన్లు తప్పనిసరి అవుతున్నాయి.

పల్లెల్లో దొరికే అనేక విధాలైన చెట్ల ఆకుల పసర్లు కంటి వైద్యానికి మంచిగా ఉపయోగపడేవి. ఒక ఆకు పసరు కళ్ళలో పిండితే కామెర్ల వ్యాధి (జాండీస్) తగ్గుతుంది. అదే పసరు కంట్లో వేస్తే పువ్వులను (పొరను) కరిగిస్తుంది. కండ్ల కలక రాకుండా నివారిస్తుంది. చేల గట్లమీద, చెరువు గట్లమీద విపరీతంగా పెరిగే బలుసాకు కూర కంటికి చాలామంచిది. ఆ ఆకును రకరకాల వంటలు వండి తింటుంటారు. ఈ పట్నవాసంలో అది దొరకటం చాలా కష్టం.



చక్కటి అందమైన పూవులు పూసే నందివర్ధనం ఆకులు పడుకునే ముందు కళ్ళపైన పెట్టుకుంటే వేడి చేసి కళ్ళు ఎర్రబడ్డవారికి చలువచేసి మంచి ఉపశమనాన్ని ఇస్తాయి. కళ్ళ మంటలు తగ్గిస్తాయి.

ఇక కలబంద (అలోవీర) గురించి చెప్పనవసరం లేదు. అది అనేక వ్యాధులను తగ్గించే దివ్యౌషధం. ఆ ఆకులలో వుండే గుజ్జులాంటి పదార్థం అనేక రకాలైన మందులలో వాడుతున్నారు.

చర్మ వ్యాధులకు కొన్ని బెరడుల కషాయం చాలా పనిచేస్తుంది. తెల్లమచ్చులు, నల్లమచ్చులు, బొల్లి, కుష్టు, తామర మొదలైన చర్మవ్యాధులకు ఈ కషాయం చాలా మంచిది.

దేవదారు, మర్రి, రావి, వేప, ఔదంబర అనే చెట్ల బెరడులు వేసి ఒక గిన్నెలో అవి మునిగేలా నీటిని పోసి ఒక రోజంతా నాననివ్వాలి. తరువాత సేర్ల నీటిని పోసి ఒకసేరు నీరు అయ్యే వరకు దానిని మరగనివ్వాలి. తరువాత దానిని వడగట్టి సీసాలో భద్రపరచాలి. దీనిని 'పంచకూట' కషాయం అంటారు. ఇది సర్వరోగ నివారిణి. కడుపులో పెరిగే దుష్ట క్రిములను చంపి, రక్తాన్ని శుద్ధిపరుస్తుంది. అనేక చర్మ వ్యాధులను తగ్గిస్తుంది.

ఇక మన ఇళ్ళలోనే దొరికే అల్లం, శొంఠి, వాము, జీలకర్ర, మిరియాలు, మెంతులు మొదలైన వాటితో చాలా రకాలుగా వైద్యం చేసుకోవచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇది ఒక గ్రంథమే అవుతుంది. ఇవి ఏవీ స్వంతంగా చేసుకోరాదు. అనుభవంగల వైద్యుల సలహా మేరకు వీటిని వాడవలసి వుంటుంది. అందుకే కదా! హనుమంతుడంతటి వాడు 'సంజీవని' ఆకులు తెమ్మంటే వాటిని గుర్తించలేక ఏకంగా పర్వతాన్నే పెకలించి తీసుకు వస్తాడు.

అంతేకాదు నేడు పైపు తిప్పితే ఇంట్లో నీళ్ళు వస్తున్నాయి. పూర్వం అలా కాదు. చాలాదూరం నడచివెళ్ళి చెరువుల నుండి, బావులనుండి, నదుల నుండి నీటిని తెచ్చుకోవలసి వచ్చేది. ప్రతివారూ వేకువఝామున లేచి నీటిని సేకరించటానికి బయలుదేరి వెళ్ళేవారు. దానితో పొద్దునే నడకతో సూర్యరశ్మి పుష్కలంగా లభించేది. శారీరక వ్యాయామం వుంటే రోగాలు దరిచేరవు.

ఈ విధంగా పల్లెవాసులు నిస్వార్థంగా చేసే ఈ వైద్యసేవకు వెలకట్టలేము. ఇంగ్లీషు వైద్యులకు దక్కే అవార్డులు కానీ, రివార్డులు కానీ వీరి దరికి రావు. పెద్దపెద్ద యూనివర్సిటీలలో లక్షలకొద్ది డబ్బు వెచ్చించి పొందే సర్టిఫికెట్లు వీరిదగ్గర లేవు. కోట్లు వెచ్చించి కట్టిన మందుల కర్మాగారాలు వీరికి అవసరం లేదు. కేవలం భస్మాలు, లేహ్యాలు, గుళికలు, చూర్ణాలు, కషాయాలు తయారు చేసి రోగులకు ఊరటనిచ్చే సామాన్య ప్రజలు. అయినా, వీరు పల్లెల్లో బ్రతికే అపర 'ధన్వంతరు'లు.

**శ్రీమతి నాగమణి గారు సరళమైన శైలిలో సహజ వైద్యం గురించి రాసింది నూటికి నూరుపాళ్ళు నిజం. మరి మనం ఈ అపూర్వా, అపార జ్ఞానాన్ని అంతరించకుండా వచ్చే తరాలకు అందజేయాలనుకుంటే ఈ సంప్రదాయ జ్ఞాన సంపదను వెతికే మా ప్రయత్నానికి చేయూతనివ్వండి. రచయితకు మా కృతజ్ఞతలు. - ఎడిటర్.**


సృజన

## వికలాంగుడైన సాగర్ సృష్టి

# నలుగురు ఆడే చదరంగం

నిజామాబాద్ వాసి పులిగిరి సాగర్ ఓ వికలాంగుడు. పుట్టిన నాలుగు నెలలకే పోలియో మహామ్మారి సోకి ఇతని కాళ్ళు చచ్చుపడిపోయాయి. ఎంత వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. ఈ కారణంగా తల్లిదండ్రులు ఇతని భవిష్యత్తును దూరమాలోచించి ప్రైవేటు (ఇంగ్లీషు మీడియం) స్కూల్లో చేర్పించారు. అక్కడ అందరిలాగే తనకూ ఆడుకోవాలని ఉన్నా, అంగ వైకల్యం కారణంగా బాల్యం నిర్వేదం అయింది. దీంతో క్యారంబోర్డు, చదరంగం ఆటమే ఆడుకోవడానికి వీలుపడేది. ఇంట్లో చెల్లెలు, తమ్ముళ్ళతో తప్ప ఆడుకునే వారు కూడా కరువయ్యారు. ఇదిలా వుండగా, ఓసారి కుడి చేయి విరిగిన కారణంగా నాటు వైద్యంతో సరిగా అతుకలేదు. దానివల్ల క్యారంబోర్డు ఆట కూడా దూరమైంది. ఇక మిగిలింది చదువు, చదరంగము మాత్రమే.

సాగర్ ధ్యాసంతా ఆటపైనే గాని చదువుపై ఉండేది కాదు. ఆ కారణంగా తల్లిదండ్రులతో చీవాట్లు తినడం తప్పలేదు. 10+2లో ఒక సంవత్సరం వృధా అయింది కూడా. మధ్య తరగతి కుటుంబానికి చెందిన సాగర్ తనకంటూ గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచనతోనే ఎక్కువ సమయాన్ని గడిపేవాడు. చదువు ఎలాగా అనుకున్నంతగా రావటం లేదు. ఇక తనకు తెలిసిన ఆటలోనే తన ప్రతిభా పాటవాలను చూపాలనుకున్నాడు. అలా ఆలోచించి ఇద్దరు ఆడే చదరంగాన్ని నలుగురు ఆడేలా తయారు చేస్తే ఎలా వుంటుంది? అని దానికి పరిష్కారం కనుగొన్నాడు. ఫలితం నలుగురు ఏకకాలంలో ఆడే చెస్ బోర్డు తయారయింది. 128 గడులున్న ఈ బోర్డుపై 64 బొమ్మలతో చెస్ ఆడాల్సి వుంటుంది. ఏక కాలంలో నలుగురు వ్యక్తులు – ప్రతివ్యక్తి ఒక్కో అడుగు వెయ్యాలంటే మూడు రాజ్యాలను చూస్తూ ముందుకెళ్ళాల్సి వుంటుంది. మామూలు చెస్‌కంటే మెదడుకు ఇంకా మేత ఎక్కువగా పెట్టాల్సి వుంటుంది.



ఈ చదరంగంలో ఏ రాజైనా మరో రాజ్యంపై దండయాత్ర చేయవచ్చు. ఓడిపోయిన వారు ఆటనుంచి తప్పుకోవాల్సి వుంటుంది. ఒక్కో రాజ్యం ఓడిపోయి చివరకు మామూలు చదరంగంలా రెండు రాజ్యాలు మిగుల్తాయి. ఈ చదరంగంలో ఏనుగు మాత్రం తనకు దగ్గరలో వున్న రాజ్యం మీదకు నేరుగా దండెత్తగలదు. ఒంటె 'ఎల్' ఆకారంలో తన గళ్ళ నుంచి మిగిలిన మూడు రాజ్యాలలోకి నేరుగా ప్రవేశించగలదు. మంత్రి తన ఇష్టం వచ్చినట్లు వెళ్ళగలదు. దీనిలో కూడా ప్రక్కనే ముగ్గురు సైనికులు కుడి రాజ్యంలోనికి, ఎడమ ప్రక్కనున్న ముగ్గురు సైనికులు ఎడమ రాజ్యంలోకి మిగిలిన ఇద్దరు సైనికులు నేరుగా ముందుకు వెళ్ళి తమ ఇష్టం వచ్చిన రాజ్యంలోకి ప్రవేశించగలరు.

ఈ చదరంగం ఆడటానికి ఎలా ఉంటుందో పరీక్షించడానికి ముగ్గురికి చూపించి ఆటలోని మెలకువలను చెప్పి వారితో ఆడించటం జరిగింది. ఏ ఆటంకం లేకుండా ఆట పూర్తి అయింది. దీన్ని బయటి ప్రపంచానికి చూపించాలని నాన్నగారి సలహాతో మా కార్పోరేటర్ కేశ వేణుగోపాల్ గారికి చూపించడం జరిగింది. ఆయన అబ్బురపడి నలుగురు అదే విధంగా ప్లైవుడ్ పై గీయమని చెప్పి దానికి కావలసిన ఆర్థిక సహాయం చేయడంతో జిల్లా మేయర్ డి. సంజయ్ గారి సమక్షంలో మీడియా ప్రతినిధులకు చూపించడం జరిగింది. ఇదే నలుగురూ ఆడే చదరంగం. ●

ఔషధం

## రైతుల పాలిట వరం వెంకట కృష్ణ సృజనాత్మక సృష్టి

# సంజీవిని



కర్నూలు జిల్లా వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన యర్రన్న, కమలాక్షమ్మ దంపతులకు జన్మించిన వెంకట కృష్ణుడు వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగి 1988లో 10వ తరగతి పాసై ఐటిఐ ఫిట్టర్ చదివి 1991లో కర్నూలు నందు ఎల్‌పిజి సిలిండర్లు తయారు చేసే కంపెనీలో 1 సం. ఉద్యోగం చేసి అక్కడి పరిస్థితులు బాగాలేక తన స్వగ్రామానికి వెళ్ళి స్వయం ఉపాధి కోసం కోళ్ళ పరిశ్రమ స్థాపించి, 4 సం.ల పాటు నడపడం జరిగింది. ఆ వ్యాపారంలో పూర్తిగా నష్టం వచ్చి ఒక పురుగు మందుల కంపెనీలోఉద్యోగం చేస్తూ స్వంతంగా పెస్టిసైడ్ షాప్ పెట్టడం జరిగింది. అందులో కూడా నష్టం రావడంతో ఇక తనకు వ్యాపారాలు అచ్చిరావనుకుని తనే స్వంతంగా ఓ పురుగు మందును తయారు చేస్తే రైతుకు సహాయం చేసినట్లు వుంటుంది, తనకూ బ్రతుకుదెరువు వుంటుందని భావించి, తాను మందుల కంపెనీలో పని చేసినప్పుడు వచ్చే రైతుల మాటలను విని, వారి బాధలను వారి ఇబ్బందులను గుర్తించి వాటిని గురించి ఆలోచించి ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన కొన్ని పదార్థాల కలయికతో తాను సృష్టించిన పురుగు మందుకు 'సంజీవని' అని నామకరణం చేసుకున్నాడు. ఆ మందును తన తోటి రైతులకు దగ్గరుండి వారి పైర్లపై వాడి చూసి అది పని చేస్తుందని నిర్ధారించుకున్న తరువాత వాటి తయారీకి శ్రీకారం చుట్టడం జరిగింది.

రైతులు విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులను, క్రిమి సంహారక మందులను వాడటం వలన భూసారం తగ్గిపోయి వాతావరణ కాలుష్యం పెరిగి, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం, భూమిలో రైతులకు మేలు చేసే రైతు మిత్ర పురుగులు చనిపోయి తెగుళ్ళు విజృంభించి పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గి రైతులు విపరీతంగా నష్టపోవడం జరుగుతున్నది. క్రిమి సంహారక మందులను వాడటం వలన ఆహారము విషపూరితమై అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకే వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణవేత్తలు సేంద్రియ ఎరువులను, సేంద్రియ క్రిమి సంహారకాలను వాడాలని, రసాయనిక ఎరువులను, క్రిమి సంహారక మందులను తగ్గించాలని సూచిస్తున్నారు.



**"సంజీవిని"** అనే సేంద్రియ దివ్య ఔషధం తెగుళ్ళను నివారించడానికి ఎలాంటి విషప్రభావము లేని ప్రాకృతిక సహజసిద్ధమైన ఫార్ములాతో తయారు చేయబడినది. అత్యధిక పోషకాలు కలిగిన ఎరువు మరియు తెగుళ్ళ కీటక నాశిని ఈ సంజీవిని.

**ఉపయోగములు :**


**వరి :** వరి పంటపై వచ్చు పోషక పదార్థాల లోపాన్ని నివారించును. వేరు వ్యవస్థను అభివృద్ధి చేసి, పోషకాలను గ్రహించే సామర్థ్యం పెంచును. మొక్కకు రోగ నిరోధక శక్తిని పెంపొందించి, ఎక్కువ పిలకలు వచ్చేలా చేస్తుంది. వరిపైరును ఆశించు అగ్గి తెగులు (బ్లాస్ట్), పొడ, మచ్చ తెగుళ్ళను నివారించును. నర్సరీ నుండి అన్ని సమయాలలో ఒక లీటరు నీటికి 7 నుండి 10 మి.లీ. 'సంజీవిని' ద్రావణాన్ని కలిపి స్ప్రే చేయవచ్చును.

**ప్రత్తి, మిరప, పసుపు, శనగ, కూరగాయల పంటలు :** ఆకుముడత, కొమ్మ ఎండు తెగుళ్ళను, డైబ్యాక్, విల్ట్, వైరస్, బ్యాక్టీరియా లాంటి తెగుళ్ళను సమర్థవంతంగా నివారిస్తుంది. మొక్క పెరుగుదలకు ఎక్కువ కొమ్మలు వచ్చునట్లు చేయుటకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని తట్టుకునేలా చేస్తుంది. ఎన్.పి.కె. ఎరువులను పూర్తిగా సద్వినియోగం చేస్తుంది. కిరణజన్య సంయోగ క్రియను (ఫొటో సింథేసిస్) అధికం చేస్తుంది. పూత, పిందె, కాయల సంఖ్యను పెంచి రాలిపోకుండా చేస్తుంది. నాణ్యతగల రంగు, కాయ పరిమాణం పెంచుతుంది. నర్సరీ నుండి అన్ని సమయా లలో ఒక లీటరు నీటికి 7 నుండి 10 మి.లీ. వరకు 'సంజీవిని' ద్రావణాన్ని కలిపి స్ప్రే చేయవచ్చును.

ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకు

వెంకటకృష్ణ, వెలుగోడు, కర్నూలు జిల్లాను సంప్రదిస్తే (సెల్ నెం. 99857 58013) ఈ మందులతో పాటు పూర్తి సమాచారం కూడా లభిస్తుంది. ●

# ఉత్తనూరు గ్రామీణ వ్యవసాయ పశువుల ప్రదర్శన



– **జె. కిషన్ పవార్,** సంగారెడ్డి.

ఉత్తనూరు గ్రామం, ఐజ మండలం, మహబూబ్‌నగర్ జిల్లాలో వుంది. ఈ గ్రామంలో సంప్రదాయంగా ప్రతియేటా ఎడ్ల పందాలు, జాతర నిర్వహించడం రివాజు. ఈ సంవత్సరం కూడా స్థానిక ప్రముఖ నేత శ్రీ తిరుమల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు జరిగాయి. ఇట్టి గ్రామీణ నేపథ్య ఉత్సవాలలో పాల్గొనుటకు హనీబీఏపి / ఎన్ఐఎఫ్ స్టాల్ ఏర్పాటు చేయుటకు హనీబీఏపి చీఫ్ కో-ఆర్డినేటర్ శ్రీ పి. గణేశం గారు నిర్ణయించారు. ఇందులో పాల్గొనే ఇన్నోవేటర్లను సమాయత్త పర్చడం, అవసరమైన మెటీరియల్ (పల్లెసృజన పత్రికలు, 6వ ద్వైవార్షిక పోటీల కరపత్రాలు, పోస్టర్‌లు, బ్యానర్‌లు మొదలైనవి) సిద్ధం చేసుకున్నాము. ఫిబ్రవరి 10న మా ప్రయాణం.

తిరుమల్ రెడ్డిగారు ఏర్పాటు చేసిన వాహనంలో సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్ నుండి ఇన్నోవేటర్లు రాంబాబు, రాజలింగం, సురేష్‌లతో అంతా కలిసి బయలుదేరాలు. రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఉత్తనూరు చేరుకున్నాము. మాకు రాత్రి బస ఐజలో ఏర్పాటు చేసినారు ఉదయాన్నే ప్రకాశం జిల్లా అనంతవరం నుండి యు. క్రిష్ణ, కర్నూలు జిల్లా వెలుగోడు నుండి యస్.వి. కృష్ణ అనే ఇన్నోవేటర్లు వచ్చి మాతో కలిశారు. స్నాన పానాదులు ముగించుకొని మేము ఉత్సవ ప్రాంగణానికి చేరుకున్నాము. పోస్టర్లు, బ్యానర్‌లతో మాకు కేటాయించిన స్టాల్‌ను అలంకరించాము. ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్‌లను ప్రదర్శన కొరకు సిద్ధం చేసుకున్నారు. ఇతర ప్రభుత్వ శాఖలు మరియు వ్యవసాయ సంబంధ పరిశ్రమలవారు కూడా తమతమ స్టాళ్ళను ఏర్పాటు చేశారు. ఉదయం నుండే గ్రామీణులు వివిధ స్టాళ్ళను ఉత్సుకతతో సందర్శించారు.

ఆరోజు అసెంబ్లీ సమావేశాలు ఉండటం వల్ల మంత్రివర్యులు శ్రీ చిన్నారెడ్డి గారు, గద్వాల శాసన సభ్యురాలు శ్రీమతి డికె అరుణ గారు అపరాహ్ణం తర్వాత విచ్చేశారు. గణేశం గారు కూడా సికింద్రాబాద్ నుండి వచ్చారు. గౌరవనీయ ప్రజాప్రతినిధుల కరకమలములచే లాంఛనంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎడ్ల పందాలు ప్రారంభించబడ్డాయి. ఇట్టి ఎడ్ల పందాలలో పాల్గొనుటకు చుట్టు ప్రక్కల జిల్లాల నుండి కూడా అనేకమంది రైతులు తమ తమ వృషభ రాజములతో హాజరైనారు. సుమారు 40-50 టన్నుల బరువుగల రాతిబండలను ఆ వృషభ రాజములు అవలీలగా లాగుతూ పరుగులు తీస్తుంటే ప్రేక్షకుల ఆనందానికి, చప్పట్లకు అంతే లేదు. ప్రారంభోత్సవ అనంతరం ఉత్సవ ప్రాంగణంలో బహిరంగసభ ఏర్పాటు చేయబడినది. స్థానిక శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, పి. గణేశం గారు, ఎన్ఆర్ఐలు, ఇతర ప్రముఖులు వేదికనలంకరించారు. శాసన సభ్యురాలు శ్రీమతి డికె అరుణ మాట్లాడుతూ ఇటువంటి ఉత్సవాలు గ్రామీణ శక్తి సామర్థ్యాలకు, ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. గణేశం గారు ఎన్ఐఎఫ్, హనీబీ సంస్థల కార్యకలాపాలు, లక్ష్యాలను గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగుకు నోచుకోని సృజనశీలురను, వారియొక్క విజ్ఞానాన్ని బయటి ప్రపంచానికి తెలియజేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇంకా ఈ ఉత్సవంలో భాగంగా విద్యార్థులకు, వారి పరిసరాలలో ఉండేవారు గుర్తించగలిగే మొక్కలు వీలయినన్ని సేకరించుకొని వచ్చే పోటీని నిర్వహించినట్లు తెలిపారు. ఇట్టి పోటీలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానంతో సభ ముగిసిన తర్వాత భోజనానంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకర్షించాయి.

మరునాడు యదావిధిగా ఎడ్ల పందాలు జరిగాయి. చుట్టుప్రక్కల గ్రామాల నుండి రైతులు తరలివచ్చారు. హనీబీఏపి / ఎన్ఐఎఫ్ స్టాల్‌ను సైతం చాలామంది రైతులు సందర్శించారు. యు. కృష్ణ గారి స్ప్రేయర్, నర్సింహాచారి గారి చౌక్, స్టార్టర్ లేకుండా వెలిగే ట్యూబ్‌లైట్, రాంబాబు, రాజలింగంల సెల్‌ఫోన్ సహాయంతో వ్యవసాయ పంపుసెట్‌ను ఆన్ / ఆఫ్ చేయడం, మోటారును దొంగలు ఎత్తుకెళ్ళకుండా రక్షణ వ్యవస్థ, నివాస గృహాలకు సైతం సెక్యూరిటీ ఏర్పాటు మొదలైన ఇన్నోవేషన్‌లను ఆసక్తితో తిలకించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది వాటిని కొనుగోలు చేయడానికి సైతం ముందుకు రావడం విశేషం. కొంతమంది యస్.వి. క్రిష్ణ (వెలుగోడు) గారి సేంద్రియ దివ్య ఔషధం 'సంజీవిని' ని మరియు ఆయుర్వేద ఔషధం 'శ్రీశైలం'ను కొనుగోలు చేయడం జరిగింది. ఇట్టి ఉత్సవాలలో పాల్గొన్న ఎంతోమంది గ్రామీణులకు ఎన్ఐఎఫ్ ఆరవ జాతీయ ద్వైవార్షిక పోటీల కరపత్రములను పంచిపెట్టడం జరిగింది. 'పల్లెసృజన' సంచికను పరిచయం చేయడం జరిగింది. ఆరోజు సాయంత్రం శ్రీ తిరుమల్‌రెడ్డి గారి దగ్గర సెలవు తీసుకుని అందరం తిరుగు ప్రయాణం అయ్యాము. ●



**ఉత్తనూరు హనీబీఏపి స్టాల్‌లో ఇన్నోవేటర్లు 'రాజలింగం, రాంబాబు, సురేష్'**

ప్రతిశోధన


# దొంగలను పట్టించే అలారం కాల్

ఊరుకెళుతున్నారా.... దగ్గర్లో వున్న పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి అని పోలీసులు మనకు సూచనలు ఇస్తారు కదా అలాంటి బెంగ వద్దంటున్నారు. నిజామాబాద్‌కు చెందిన యువ ఇన్నోవేటర్ మండాజి నర్సింహాచారి. ఇంట్లో దొంగతనం జరిగితే ఇంటి యజమాని అమెరికాలో వున్నా గుర్తించే విధంగా కొత్త ప్రయోగాన్ని నర్సింహాచారి కనుగొన్నారు. అదెలా పనిచేస్తుందంటే... మైక్రో ప్రాసెసర్ ద్వారా సెల్‌ఫోన్‌కు కనెక్ట్ చేసే పరికరాన్ని సెల్‌ఫోన్‌లో మన దగ్గరలో వున్నా పోలీస్ స్టేషన్ నెంబర్‌తో పాటు చుట్టుపక్కల వారి సెల్‌ఫోన్ నెంబర్, మన బంధువుల సెల్ నెంబర్‌తో పాటు మన వెంట తీసుకెళ్ళే సెల్‌ఫోన్ నెంబర్‌ను ఇంట్లో పెట్టిన సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసి మైక్రో ప్రాసెస్‌ను ఇంట్లో బీరువా వద్ద అమర్చుకోవాలి. ఇంట్లో సిగ్నల్ ఉండే ప్రాంతంలో సెల్‌ఫోన్‌ను పెట్టాల్సి వుంటుంది. ఈ సెల్‌ఫోన్‌లో మన ఇంటి నెంబర్, వీధి, అడ్రస్ గ్రామం పేరుతో కూడిన వివరాలను ఇంట్లో ఉంచిన సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసి వుంచాలి. ఈ విధంగా ఇంట్లో మైక్రో ప్రాసెస్‌ను ఏర్పాటు చేసుకొని ఇంటికి తాళం వేసి మనం ఎన్ని రోజులైనా ఇతర ప్రాంతాలకు వెళ్ళి రావచ్చు. మైక్రో ప్రాసెస్‌కు కరెంటుతో సంబంధం లేదు. బ్యాటరీతో పని చేస్తుంది. దీని చార్జింగ్ నెల రోజుల వరకు పని చేస్తుంది. దొంగ ఇంట్లోకి ప్రవేశించి బీరువాను ముట్టిన వెంటనే "ఇంట్లో దొంగలు పడ్డారు వెంటనే వెళ్ళి పట్టుకోండి" అని మనం ముందు పేర్కొన్న 10 సెల్ ఫోన్‌లకు మెసేజ్ పంపుతుంది. ఆ దొంగకు తెలియకుండానే ఈ మెసేజ్ పదిమంది సెల్ ఫోన్లకు వెళ్ళిపోతుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, బంధువులు, చుట్టుప్రక్కల వాళ్ళు మన ఇంటికి వెళ్లి దొంగలను సులభంగా పట్టుకోవచ్చు. మనం ఏ సెల్‌ఫోన్ నెంబర్లు ఫీడ్ చేసి వెళ్తామో ఆ నెంబర్లు గల సెల్ ఫోన్లు సిగ్నల్ ఉన్న ప్రాంతంలో వుంటేనే దొంగలు పడిన మెసేజ్ వస్తుంది. కవరేజ్ ఏరియాలో లేకుంటే మెసేజ్ రాదు. ఊరు వెళ్ళి వచ్చిన తర్వాత మనమే బీరువాను ముట్టాల్సిన సమయంలో దొంగలు పడ్డట్టు వెళుతుందని అనుమాన పడుతున్నారా? అలాంటి అనుమానం అవసరం లేదు. ఎందుకంటే మనం ఇంట్లోకి వచ్చిన వెంటనే ముందుగా మైక్రో ప్రాసెస్ సిచ్ ఆఫ్ చేస్తే సరిపోతుంది. ఇదే మాదిరిగా ఎక్కడికైనా వెళ్ళినా ఇంటిని క్షేమంగా రక్షించుకోవచ్చు.

తక్కువ ఖర్చుతో మైక్రో ప్రాసెస్‌ను తయారు చేసి ప్రజలకు అందివ్వడానికి మరో నాలుగు నెలల సమయం పడుతుందని నర్సింహా చారి తెలియజేస్తున్నాడు. నర్సింహాచారి ఈ ప్రయోగం ద్వారా విశాఖ పట్నం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో నోబెల్ గ్రహీత రాబర్ట్ కర్ల్ నుంచి అభినందనలు అందుకున్నారు. పర్యావరణ శాస్త్రవేత్తలు, డిఎస్ఐఆర్, డిఆర్‌డివో లాంటి డిఫెన్స్ శాస్త్రవేత్తల సంస్థల నుంచి, సందర్శకుల నుండి ప్రశంసలు అందుకున్నారు.


సెల్‌ఫోన్‌తో దొంగలను పట్టుకునే ప్రయోగం

నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నర్సింహాచారి సెల్‌ఫోన్‌తో దొంగలను పట్టుకునే ప్రయోగమే కాకుండా ఇంకా మరెన్నో ప్రయోగాలు చేయనున్నారు. గతంలో కాలిపోయిన


ప్రయోగాన్ని వివరిస్తున్న నర్సింహాచారి

ట్యూబ్‌లైట్లను చౌక్, స్టార్టర్ లేకుండా వెలిగించడం, వీధి లైట్లు రాత్రి కాగానే వెలిగి ఉదయాన్నే వాటంతట అవే ఆరిపోయి విద్యుత్‌ను పొదుపు చేసే ప్రయోగాన్ని కనుగొన్నారు. నిజామాబాద్ నగర మేయర్ ధర్మపురి సంజయ్ ప్రోత్సాహంతో తాను ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నానని, సైన్స్ కాంగ్రెస్‌కు వెళ్ళడానికి కూడా మేయర్ అన్ని విధాలుగా సహకరించారని ఇదే విధంగా నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ హనీబీఏపి కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ (రిటైర్డ్) గణేశంల ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేసి జిల్లా ఖ్యాతిని దేశమంతటా వ్యాపింపజేస్తానని నర్సింహాచారి ధీమా వ్యక్తం చేశాడు.

**నరసింహాచారి స్వతహా సృజనాత్మక శక్తి గల నవ యువకుడు ఆయన సృజన ఎంత గొప్పదో మనిషి అంత మంచివాడు. అందరికీ సహాయం చేయాలని, సమాజానికి జ్ఞానాన్ని పంచాలన్న ఆతృత గల చారికి, మంచి భవిష్యత్తు వుందని, ఆయన కలలు పండాలని ఆశిస్తున్నాం. ఆయనకు హనీబీఏపి, ఎన్ఐఎఫ్‌ల సహకారం ఎల్లప్పుడూ వుంటుందని తెలియజేస్తూ.**

**-ఎడిటర్**

శోభద

## సింగరేణి ఉమన్స్ కాలేజి విద్యార్థుల కృషి

# మన చుట్టూ ఉన్న మొక్కలతో ఆరోగ్య రక్షణ

అధ్యాపకులు శ్రీమతి జె. కనకదుర్గ, శ్రీమతి రమణ ఆధ్వర్యంలో సింగరేణి ఉమన్స్ కాలేజి విద్యార్థులు సంప్రదాయ జ్ఞానాన్ని వాడే పద్ధతులను గ్రామాల నుండి సేకరించారు. వీరి కృషిని హనీబీ ఎన్ఐఎఫ్‌కు పంపింది. కొన్ని ప్రధానమైన జ్ఞాన సంపదను ఇక్కడ ప్రచురించాము. కాలేజి నిర్వాహకులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు – ఎడిటర్

మన చుట్టు ప్రక్కల వుండే మొక్కల నుండే మనకు ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయి. వాటన్నింటిని గురించి తెలుసుకోవడం వల్ల మనంతట మనమే రోగాల నుండి రక్షించుకోగలుతాము.

హనీబీఏపి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంస్థ మాకీ అవకాశం కల్పించడం మాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఈ ఫౌండేషన్‌కు మమ్మల్ని పరిచయం చేస్తున్న డా. కనకదుర్గ గారికి కూడా సదా కృతజ్ఞులం.



**పి. శిరీష,**
బి.జడ్.సి.

**1. చిన్న తెలగపిండి చెట్టు :**

ఈ చెట్టు కూ రను తోటకూర వేపుడు చేసినట్లు చేసుకుని అన్నంలో కలుపుకుని తింటే కిడ్నీలో ఉన్న రాళ్ళు కరిగిపోవటం జరుగుతుంది. రక్త శుద్ధి కూడా జరుగుతుంది.



**2. గులాబీ చెట్టు :**

గులాబీ పువ్వుల రసం నువ్వుల నూనెతో కలిపి 2 నుండి 3 చుక్కల మిశ్రమాన్ని ముక్కులో వేసినచో ఎక్కువగా వచ్చు తుమ్ములు రెండు రోజుల్లో తగ్గిపోతాయి.

**3. ప్రత్తి చెట్టు :**

ప్రతిచెట్టు ఆకు పసరును ఏవైనా గాయాలు, కోసుకున్న చోట పూస్తే రక్తస్రావం ఎక్కువగా జరుగకుండా నివారిస్తుంది. దీనివల్ల రక్తస్రావం ఆగటమే కాకుండా, గాయం కూడా తొందరగా మానిపోతుంది.

ప్రత్తి గింజలను ఎండించి, కాల్చిన మసిని పళ్ళు తోమటానికి (టూత్ పౌడర్) ఉపయోగిస్తే పళ్ళలోని క్రిములు నశిస్తాయి.



ప్రత్తి వేళ్ళను గంజితో నూరి కాలుపై రాస్తే బోదకాలు తీసిపోతుంది.

**4. వేప :**

✻ వేప చిగుళ్ళను ముద్దగా నూరి ఆరు మాసాలు సేవిస్తే కుష్టు వ్యాధి నయమవుతుంది.

✻ కొబ్బరినూనెలో వేపాకు రసం వేసి శరీరానికి రాస్తే చిడుము లాంటివి తగ్గుతాయి.



✻ వేప చిగుర్లు, పసుపు రెండు సమానంగా కలిపి ముద్దచేసి శరీరానికి పూసుకున్నయెడల దురదలు నశిస్తాయి.

✻ వేప గింజలు ముద్దగా నూరి మూడు తమలపాకులలో ఒక గ్రాము పెట్టి రోజుకు ఒకసారి తీసుకున్నయెడల కడుపులో ప్రేగులో వుండే నులిపురుగులు నశిస్తాయి.

✻ వేపచెట్టు కషాయం సేవించిన నీళ్ళ విరోచనాలు తగ్గిపోతాయి.

**5. నత్తాకు చెట్టు :**

✻ ఏవైనా కురుపులు మానకుండా ఉన్నచో నత్తాకుల రసాన్ని వేస్తే అవి తొందరగా మానిపోతాయి.

✻ చిన్న పిల్లలకు సిడం లాంటివి అంటే చిన్న చిన్న పొక్కులు దగ్గర దగ్గరగా వస్తాయి. వాటికి కూడా వీటి పసరు రాయడం వల్ల మానిపోతుంది.

**6. జామచెట్టు :**

జామచెట్టు చిగురుటాకును రెండు రెట్ల నీటిలో మరిగించి వడపోసి, ఆ కషాయంతో పుక్కిలించిన చిగుళ్ళ వాపు, నొప్పి వుండదు. ఈ విధంగా నొప్పి తగ్గేవరకు చేయాలి.

**7. నల్ల గరిక గడ్డి :**

గర్భ నిరోధము కొరకు స్త్రీ ప్రసవించిన వెంటనే 10 లేక 15 గ్రాముల నల్ల గరిక గడ్డిని నీళ్ళలో నూరి త్రాగించిన మళ్ళీ గర్భం రాదు.

**8. గుంట గన్యాకు :**

గుంటగన్యాకును ఎండబెట్టి, పొడిచేసి, ఆ పొడిని కొబ్బరినూనెతో కలిపి మరగబెట్టి, దానిని వడపోసి, ఆ వడపోసిన నూనెను తలకి పూసుకుజవడం వల్ల జుట్టు నల్లగా ఉంటుంది. అంతే కాకుండా రాగి వెంట్రుకలు, కొంచెం ఎర్రగా ఉన్న వారికి నల్లగా అవుతుంది. జుట్టు రాలటం కూడా తగ్గిపోతుంది.

**9. నల్లతుమ్మ చెట్టు :**

నల్లతుమ్మ చెట్టు పట్టితో కషాయం కాచి దానిలో కొద్దిగా పటిక కలిపి పుక్కిలించి వాడిన దంతముల నొప్పి, చిగుళ్ళ నుంచి చీము కారుట, చిగుళ్ళ వాపు హరించును.

**10. మందారం :**

✻ మందార చెట్టుపై బెరడు ఎండబెట్టి, పొడిచేసి ఉదయం, సాయంత్రం 2 గ్రాముల చొప్పున నేతిలో కలిపి సేవించిన పదిహేను రోజుల్లో మూర్ఛ తగ్గిపోతుంది.

**11. సీతాఫలం :**

✻ సీతాఫలం ఆకులు ఉప్పు కలిపిన చూర్ణమును సేగ్గడ్డల వంటి గడ్డలకు కట్టిన అవి పగిలి హరించిపోవును.

✻ సీతాఫలం చెట్టు చెక్కను తీసుకొని కషాయం పెట్టి త్రాగిన జ్వరం తగ్గుతుంది.

✻ సీతాఫల గింజలు మేకపాలతో నూరి తలకు పూసినయెడల బట్టతల పోతుంది.

✻ సీతాఫలం చెట్టుయొక్క కషాయం తీసి త్రాగిన నిస్సత్తువ / నీరసం తగ్గుతుంది.

**12. జిల్లేడు :**

✻ జిల్లేడు ఆకుల రసం ఒక భాగం, పసుపు కొమ్ముల ముద్ద 2 భాగాలు, ఆవనూనె రెండు భాగాలు కలిపి నీరు బాగా ఇగిరే వరకు కాచి చల్లార్చి ఆ నూనెను గజ్జి కురుపులపై రాసిన యెడల పుండ్లు నశించును. దురద కూడా మానును.

✻ పండిన జిల్లేడు ఆకులకు నెయ్యి రాసి నిప్పులపై వేడి చేసిన ఆకుయొక్క రసం చెవిలో 2 లేదా 3 చుక్కలు వేసిన చెవిపోటు తగ్గిపోతుంది.

– తెల్ల జిల్లేడు పాలు, పిప్పి పన్నుపై వేసిన పిప్పి పన్ను బాధ తగ్గుతుంది.

**13. బొప్పాయి :**

✻ బొప్పాయికాయ పాలు పూసిన తామర నశించును.

✻ బొప్పాయి పండు తింటున్న ఏ మందుకు కూడా తగ్గని విరేచనములు మాయమగును.

✻ పోతు బొప్పాయి పువ్వులు నూరి తలపై రాసిన పేను కొరుకుడు వల్ల ఊడిపోయిన వెంట్రుకలు మళ్ళీ తిరిగి వస్తాయి.

**14. నిమ్మ :**

✻ నిమ్మ పండు తొక్కను తల్లెటి బూడిదవలె కాల్చి ఆ భస్మమును 2 గ్రాముల చొప్పున ప్రతిరోజు రెండుసార్లు తేనెతో కలిపి త్రాగినచో గర్భిణీ స్త్రీలకు వాంతులు (వేవిళ్ళు) హరించును.

✻ నిమ్మరసంలో నాగమల్లి వేరు గంధం అరగదీసి శరీరానికి పూసుకున్నయెడల శరీరంపై దురదలు ఉండవు.

✻ నిమ్మకాయ రసం, మాదీఫలరసం, తేనె సమానంగా కలిపి పిప్పి పంపిపై పెట్టిన పురుగులు నశించి బాధ తగ్గుతుంది.

✻ నిమ్మకాయ రసంలో తేనె సోడా వేసి పొంగించిన వెంటనే త్రాగినచో పైత్యం తొలగును.

✻ నిమ్మకాయ రసంలో జీలకర్ర 7 రోజులు నూనెలో నానబెట్టి ఉదయంపూట తింటే తల తిప్పడం తగ్గిపోతుంది.



**15. మఱ్ఱిచెట్టు :**

✻ మఱ్ఱిచెట్టుపాలు పగిలిన కాళ్ళకు లేపనం చేసిన యెడల కాళ్ళ పగుళ్ళు నయమగును.

✻ తెల్లవారుఝామున మర్రిపాటు 6 మాసాలు సేవించిన కుష్ఠు వ్యాధి నయమగును.

✻ మఱ్ఱి ఊడలు గంట గలగరాకు సమానంగా తెచ్చుకొని మెత్తగా నూరి దాంట్లో 3 రెట్ల నువ్వుల నూనెలో వేసి కాచి వడగట్టి ప్రతినిత్యం తలకు రాసుకున్నట్లయితే తల వెంట్రుకలు పెరుగుతాయి.

✻ మఱ్ఱి పాలు త్రాగిన మేహ శాంతి, శరీరానికి తేజస్సు కలుగుతుంది. దీన్ని 40 రోజులు వాడాలి.

✻ మఱ్ఱి చిగుళ్ళను నమిలి ఉమ్మివేయుచున్నచో నోటిపూత నయమగును.

**16. కలబంద :**



✻ కలబంద రసమును కాలిన వెంటనే ఆ ప్రదేశంలో రాయడం వల్ల కాలినప్పుడు మంట తగ్గిపోతుంది.

✻ కలబంద లేపనము ముఖానికి రాయడం వల్ల మొటిమలు తగ్గిపోతాయి.

**17. మాసపత్రి :**

✻ మాసపత్రి ఆకులు కట్టిన తలనొప్పి నయమగును.

✻ మాసపత్రి ఆకుల రసం త్రాగుచున్న మూర్ఛ వ్యాధి తగ్గిపోతుంది.



**ఆలూరి స్వాతి,**
1 బి.జడ్.సి.

**18. మహాబలి చెట్టు :**

ఈ చెట్టు వేరు కాండం ఎండబెట్టి పొడి చేసి నీళ్ళలో కలుపుకొని త్రాగినచో మనిషికి చాలా బలం చేకూరు తుంది.

**18. గడ్డి చామంతి :**

ఈ గడ్డి వేరును దంచి, చక్కెర నీళ్ళలో కలుపుకుని త్రాగినచో స్త్రీలలో తెల్లమైల బాగా తగ్గుముఖం పడుతుంది.

**19. ఉల్లిగడ్డ :**

ఎవరైనా క్రింద పడి ముక్కు బెదిరినప్పుడు ఉల్లిగడ్డను కచకచా నమిలి ఆ పిప్పిని ముక్కుదగ్గర పెడితే రక్తం వెంటనే ఆగిపోతుంది.



**20. వెల్లుల్లి :**

కొండనాలుక పెరగడం వల్ల వచ్చే కోరింత దగ్గు నివారణకు వెల్లుల్లి పాయలని దంచి కొండ నాలుకకు అంటించినచో కోరింత దగ్గు తగ్గుతుంది. ఈ విధంగా దగ్గు తగ్గేవరకు చేయాలి.

**21. బోడసరం :**

ఈ చెట్టు ఆకుల్ని వేర్లని నలిపి రసం తీసి ఆ రసానికి సమానంగా కొబ్బరి నూనెను కలిపి రెండింటినీ కొత్త మట్టి పాత్రలో మరగబెట్టి చల్లారిన తర్వాత కీళ్ళ నొప్పులున్నచోట రాస్తే త్వరలోనే తగ్గిపోతాయి.

**22. చెన్నంగి :**

చెన్నంగి ఆకు పసరును తీసి దెబ్బలు తగిలిన చోట పూస్తే దెబ్బ ఇట్టే మాయమౌతుంది. కీళ్ళ నొప్పులు ఉన్నవారు కూడా ఈ ఆకు పసరును పూస్తే త్వరలో నయమౌతాయి.



**బి. అనిత ప్రియ,**
1, బి.జడ్.సి.

**23. జామ :**

జామచెట్టు లేత చిగురుటాకులను కోసి దానిలో బెల్లం కానీ, చక్కెర కానీ కలిపి మెత్తగా నూరి చిటికెడంత తింటే విరేచ నాలు తగ్గుముఖం పడతా యి. అయితే ఇది తిన్న తరువాత అరగంట వరకు ఏమీ తినకూడదు, కనీసం నీళ్ళు కూడా త్రాగరాదు. ఇది తిన్న రెండు మూడు గంటల్లోనే గుణం కనిపిస్తుంది.

**24. బర్రెంకి :**

ఈ మొక్క కాండాన్ని తుంచితే పాలు వస్తాయి. ఆ పాలను పిప్పి పళ్ళపై పోస్తే నొప్పి తగ్గిపోతుంది. వీటి ఆకులను కూడా మెత్తగా దంచి పంటిపై 10 నిమిషాలు ఉంచవచ్చు. ఈ మొక్కలో ఏ భాగమైనా పంటి నొప్పి తగ్గించడానికి బాగా పనిచేస్తుంది.

**25. వాయిలాకు :**

తలనొప్పి తగ్గడానికి ఈ మొక్క లేత చిగుళ్ళను నూరి దానిలో కాస్త అల్లం వేసి మెత్తగా నూరి ఆ ముద్దను పంచదారతో కలుపుకుని లేదా అలాగే కానీ ఉదయం లేవగానే పరగడుపున తినాలి.

అంతే కాకుండా వాయిలాకులను నీటిలో వేసి వేడి చేసి ఆ నీటితో బాలింతలకు స్నానం చేయాస్తే వళ్ళు నొప్పులు లేకుండా ఉంటారు. ఈ నీటిని పసి పిల్లలకు స్నానం చేయిస్తే కూడా మంచిదే. పిల్లల శరీరంపై ఎటువంటి క్రిములు ఉన్నా చనిపోయి, ఆరోగ్యంగా వుంటారు.

**26. కాకర ఆకు :**



కుక్క కరచిన వెంటనే కాకర ఆకు పసరును లేదా ఆకును గుడ్డలో కట్టి కుక్క కరచిన చోట కట్టినట్లయితే కుక్క కాటుకు కొంతవరకు నివారిస్తుంది.



**యన్. సంధ్యారాణి,**
1 బి.జడ్.సి.

**27. రణపాల :**

శరీరంలో ఏక్కడై నా వేడి గడ్డలు అయితే, రణపాల ఆకును తీసుకొని దానిమీద నుంచి నూనె వ్రాసి కొద్దిగా వేడి చేసి గడ్డ ఏర్పడిన చోటున గుడ్డతో కట్టుకోవాలి. ఇలా రోజూ నిద్రపోయే ముందు కట్టుకొని (7 రోజులు) ఉదయాన్నే తొలగించాలి. ఇలా చేస్తే గడ్డలు మటుమాయం అయిపోతాయి.

**ఆర్. రమాదేవి,** 2 బి.జడ్.సి.

**28. టాక్సస్ :**

✱ టాక్సస్ బకాటా ఆకులు ఆస్తమా, బ్రాంకైటిస్, దగ్గు, ఎపిలెప్సీ మరియు అజీర్తి మొదలగు వ్యాధులకు విరోధక మందుగా ఉపయోగిస్తారు.

✱ టాక్సస్ మొక్కనుండి 'టాక్సిన్' అనబడే ఆల్కలాయిడ్ లభిస్తుంది. ఈ ఆల్కలాయిడ్ నుండే కాన్సర్ నిరోధక మందు కనుగొనబడింది.

ఆవాసం – విస్తరణ : టాక్సస్ అనే ప్రజాతి మన భారతదేశంలోని హిమాలయాల్లో ఎక్కువగా పెరిగేది. ఇది హిమాలయ పర్వతాల్లో సుమారు 1800 మీటర్ల ఎత్తయిన ప్రాంతాల్లో గల కాశీ జైన్షియా కొండలు, నాగ కొండల్లో పెరుగుతుంది. ఔషధ ప్రాముఖ్యత గల మొక్కలకు మన ఇతిహాసాల్లో హిమాలయ పర్వతాలు పుట్టినిల్లుగా కన్పించును. అయితే, దీని ఔషధ గుణాల కారణంగా ఇది విదేశీయులచే 'బయోపైరసీ'కి గురవుతుంది. అందువల్ల ఈ ఔషధ జాతి మన భారత దేవంలో విలుప్తం చెందుతుంది. దీనిలోని ఔషధగుణాలు మన నిత్య జీవితంలో ఎంతో ఉపయోగపడును. అంతేగాక క్యాన్సర్ మన సమాజంలో విస్తరిస్తున్న భయంకర వ్యాధి. దీని నివారణకు సంబంధించి, శాస్త్రవేత్తలు, ఎన్నో

పరిశోధనలు చేస్తున్నారు. అయితే మన భారతదేశంలో అందుబాటులో వున్న ఈ మొక్క నుండి లభిస్తున్న టాక్సన్ క్యాన్సర్ నిరోధక ఔషధాన్ని మనం వినియోగించుకోవాలి. అందుకొరకు ఈ మొక్కను అధిక సంఖ్యలో వృద్ధి చేసి దాని ఔషధ ఫలితాన్ని పొందాలి. విలుప్తం చెందుతున్న ఈ జాతిని వృద్ధి చేయాలి. కణజాల వర్ధన పద్ధతుల ద్వారా మొక్క యొక్క చిన్న



సూక్ష్మజాలం నుండి ఎన్నో మొక్కల్ని వృద్ధి చేయవచ్చు. బయోటెక్నాలజిస్టులు, జన్యు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ మొక్క ఔషధ గుణాల్ని, ఇంకా పూర్తి స్థాయి వినియోగంలోకి తీసుకు రావడానికి అవకాశం కలదు. అందువల్ల బయో టెక్నాలజిస్ట్ ఈ మొక్క ప్రాముఖ్యతను గుర్తించి, తమ పరిశోధనకు దీనిని వినియోగించు కోవచ్చు. భవిష్యత్తులో ఈ మొక్క ఔషధ గుణాల్ని మనందరికి అందుబాటులోకి తీసుకు రావచ్చు.



**బి. మంజుల,**
2 బి.జడ్.సి.

**29. జుట్టుకాకుమొక్క :**
సెప్టిక్ అయినచోట ఈ మొక్క ఆకుల నుండి వచ్చే పాలను పెట్టినచో సెప్టిక్ సంబంధిత వ్యర్థ పదార్థాలు బయటకు వస్తాయి.

**30. ఈత చెట్టు :** ఈ చెట్టు వేర్లను కషాయం రూపంలో తీసుకుంటే అధిక వేడికి ఔషధంగా పని చేస్తుంది.

**31. వేప చెట్టు :** కాండాన్ని నీటిలో నానబెట్టి తాగినచో వేడికి వచ్చే చెమటకాయలు, కాళ్ళ పగుళ్ళు రావు.

అడవి చెన్నంగి మొక్క : వాపులు, దెబ్బలు తగిలిన భాగాల వద్ద ఈ మొక్క ఆకుల పసరు పెట్టి కట్టు కట్టినప్పుడు వాపులు, గాయాలు తొందరగా నయం అవుతాయి.

**32. గోరింటాకు :** గర్భిణీ స్త్రీలు, పిల్లలు తెల్లగా పుట్టడానికి తింటారు. వేడికి మంచి ఔషధంగా పని చేస్తుంది. గోరింటాకు బాగా దంచి తలపై పెట్టుకుని ఒక గంట తర్వాత స్నానం చేస్తే వంట్లో వేడిని, తలలో వేడిని తగ్గిస్తుంది.

**33. సరస్వతి మొక్క :** ఈ మొక్క ఆకులు తింటే మెదడు చురుకుగా పని చేస్తుంది.

**34. కలబంద :** కాళ్ళకు ముళ్ళు గుచ్చుకున్నపుడు కలబందను గుజ్జుగా చేసి కట్టినచో ముళ్ళు బయటకు వస్తుంది. దిని జిగురుతో దంతాలను శుభ్రం చేసుకోవడం ద్వారా దంతాలు దృఢంగా వుంటాయి.

**35. దొండ మొక్క :** దొండ పసరును చిన్న పిల్లలకు తాగించటం వల్ల జీర్ణకోశ సంబంధ వ్యాధులు రాకుండా వుంటాయి.

**36. కాకర మొక్క :** ఆకుల పసరును కుక్క కరచినచోట పోయటం వలన సెప్టిక్ అవకుండా నిరోధిస్తుంది.

**37. నేలమర్రి :** పెద్ద పెద్ద గాయాలకు ఈ మొక్క ఆకులను మెత్తగా చేసి పెట్టినపుడు గాయాలు తొందరగా నయమవుతాయి.

**38. నేల ఉసిరి :** కిడ్నీలకు సంబంధించిన వ్యాధులకు చాలా బాగా పని చేస్తుంది.



## హనీబీఏపి కి సంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి పంపిన మరికొందరు విద్యార్థులు



**దుర్గా ప్రవీణ,** 3 బిజడ్‌సి



**మంపికుంద** 3 బిజడ్‌సి



**పి. శ్వేత,** 2 బిజడ్‌సి



**యం. సృజన,**2 బిజడ్‌సి



**సి.హెచ్. సుజాత** 1 బిజడ్‌సి

**ఇలా ప్రకృతిలో ఇమిడివున్న జ్ఞానాన్ని వెలుగులోకి తీసే ప్రయత్నం మరికొంతమంది విద్యార్థులు చేస్తారని విశ్వసిస్తున్నాం. ఎక్కువ జ్ఞానాన్ని సేకరించిన వారికి హనీబీఏపి పారితోషికంగా ఒక సంవత్సరం పాటు 'పల్లెసృజన' పత్రికను ఉచితంగా పంపబడుతుంది.** – ఎడిటర్

శోధయాత్ర

# ఉత్తర భారతంలో హనీబీ కాశ్మీరు శోధయాత్ర

పంతొమ్మిదవ శోధయాత్ర చాలా విశేషాలతో నిండినది. ఇది కాశ్మీరులోయ నుంచి మనస్సుగల, ఊహాశక్తి మరియు చక్కగా ఆదరించు గుణము గల ప్రజలకు మిగతా భారతావనిలోని ప్రజలకు గల అడ్డు గోడలాంటి అపోహలను పూర్తి ఛేదించినది. ఈ శోధయాత్ర లో అక్కడి ప్రజలయొక్క, యువత యొక్క విజ్ఞానార్జన దాహార్తిని గమనించడమైనది. మరో విశేషము ఏమిటంటే అక్కడి వనితలలో కొత్త విషయాలు కనుగొనాలనే ఆసక్తి కలిగి వుండటం. కాశ్మీరులో ఉగ్రవాద చర్యలు మరియు వాటిని అణచివేసే ప్రతిచర్యలు నిరంతరంగా సాగుతున్నా అక్కడి ప్రజల నూతన ఆవిష్కరణలపై గల ఆసక్తికి ఏమాత్రం ఆటంకం కలుగలేదు.

చాలామంది "శోధయాత్రికులకు" తాము పర్యటిస్తున్న పరగణాలలో తాము దేనిని వెలికి తీయగలరో తెలియదు. ఎందుకంటే ఆ ప్రదేశమంతా అన్ని రకములుగా అస్తవ్యస్తంగా వున్నది. కొంతమంది పై కారణములు ఇతర భయములచేత యాత్ర విరమించుకొన్నారు. కాని ప్రజల నుండి స్పందన చూసిన తరువాత 50 మందికి పైగా వ్యవసాయదారులు, కళాకారులు, వృత్తి వ్యాపారులు, విద్యార్థులు తదితరులు తమ భయాన్ని పటాపంచలు చేసుకొన్నారు. శోధయాత్రకు ఒకరోజు ముందు కొందరు శోధయాత్రికులు 'డిపార్ట్‌మెంటల్ ఆఫ్ అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్', శ్రీనగర్ యూనివర్సిటీని సందర్శించారు. అక్కడ డా. భట్ గారు ముస్తాక్ అహమ్మద్ దార్ అనే పరిశోధకునికి అతను తయారు చేస్తున్న తక్కువ ధరకల చెట్లు ఎక్కువ సాధనము మరియు బాదంపప్పు పగులగొట్టే పరికరములను నవీకరించడంలో సహాయము చేస్తున్నారు.

యాత్ర ప్రభుత్వ బాలుర పాఠశాల నుండి ప్రారంభమైనది. ఇది క్వాజిగుండ్‌లో కాలువ ప్రక్కన వున్నది. జహూర్, ముస్తాక్‌లు కలిసి యువ విద్యార్థులను, వ్యవసాయ దారులను, వృత్తి పనివారిని 'ఖేరి గ్రామం' నుంచి రప్పించి యాత్రను నడిపారు. అన్ని రకముల ప్రతికూలమైన పరిస్థితులలో ఉత్కంఠ, ఉత్సాహ భరితమైన ఈ యాత్ర 'హనీబీ నెట్‌వర్క్' వారిపై గల మరియు ఎన్ఐఎఫ్, స్రిష్టి వారిపైగల నమ్మకంతోను, వారికి గల అపార అనుభవం, కొన్ని నెలలుగా చేస్తున్న అన్ని రకముల పథకముల వివరాణాలు చూసి సహచర పాదయాత్రికులు కృత నిశ్చయంతో ఈ యాత్రను సఫలం చేయాలని నిర్ణయించారు.

'క్వాజిగుండ్' లో ప్రభుత్వ పాఠశాల నుండి ప్రారంభమైంది యాత్ర. విద్యార్థులు తమ నిరశనతో ప్రారంభించారు. ఇవి తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలు. ఆ పరిసరాలలో వన్యప్రాణులు అంతరించి పోతున్నాయి. వనాలు తరిగిపోతున్నాయి, మానవ వనరులు కూడా ఉపయోగంలో లేవు. పెరిగిపోతున్న కాలుష్యం మరియు నీటి వనరుల కాలుష్యం, ఔత్సాహికులలో పరస్పర అవగాహన లేకుండటం ప్రత్యేకంగా పర్యావరణంపైన మొదలైనవి.

సాధారణ చర్చలు జరుగుతున్నపుడు హిలాల్ అనే వ్యక్తి అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. "కాశ్మీర్‌లో ఏమి లేదని కాదు, కాశ్మీరు ఏది సమృద్ధిగా వుందో దాని గురించి ఆలోచిద్దాం" అక్కడ మంచు, శిలలు, నీరు మానవ వనరులు అపార వృక్ష సంపద మొదలైనవి వున్నాయి. అతను కొన్ని వింతగొలిపే విషయాలు అడిగాడు. రేడియో తరంగాలను నీటినుండి పంపగలమా? గాలిలో తరంగాలు ప్రయాణించేటప్పుడు పెద్ద పెద్ద కొండలు అడ్డు వస్తవి కదా. హిమాన్ని (మంచును) శక్తికింద మార్చవచ్చా లాంటివి.

'చిక్' లోని గనిఖాన్ మెమోరియల్ పాఠశాలకు వెళ్ళే మార్గంలో యాత్రకు చాలా పెద్ద 'పవర్‌లైన్'ని చూసినారు. అక్కడ టవర్స్ కట్టడానికి 11,000 వృక్ష సంపదను నరికివేశారు. ఆ పరగణాకు దాని నష్ట పరిహారం కూడా పంచలేదట. యాత్రికులు చిన్న చిన్న సందుగొందుల్లో (గల్లీల్లో) నడిచారు. అక్కడ భూమి కోత కూడా ఎక్కువే. ఎక్కడ కూడా 'వాటర్‌షెడ్' ప్రోగ్రాం కనపడలేదు.

ఇక్కడ కొన్ని సంవత్సరాలు దుర్భిక్షం నడిచింది. అందువల్ల అక్కడి శక్తి అంతా హరించబడింది. అక్కడి వ్యవసాయ శాఖ ఇప్పుడు ప్రాథమిక సదుపాయాలు కల్పిస్తున్నది. ఇక్కడ కొత్తగా నియమితులైన 'ఆచ్చాబల్' వ్యవసాయ శాఖ ఉద్యోగులు మాత్రమే మా యాత్రికులని కలిసి, ఆహ్వానించి పరస్పర సంభాషణలు జరిపారు. విద్యాశాఖవారు ప్రతి పాఠశాలకు మారాక గురించి చెప్పి వారి పాఠశాలల్లో వసతి కల్పించవలసిందిగా ఆదేశించారు. రెండు దశాబ్దాలుగా జరుగుతున్న అలజడుల వల్ల అక్కడి పాఠశాలల పరిస్థితి ఏమీ బాగోలేదు. ఇదే కొనసాగితే తరువాత ఏమీ మిగలక పోవచ్చు. చెప్పాలంటే పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నవి.

'షంగాస్' నుండి 'ఉత్రుసూ' వెళ్ళే దారిలో ఏకైక నీటితో నడుపబడే గోధుమ పిండి చేసే యంత్రాన్ని చూశాము. దారిలో పలు సెలయేర్లు, కాలువలు చూశాము. ఎక్కడగానీ 'టర్బయిను'తో విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు.

మైదాన ప్రాంతంలో మనం 20 నుండి 30 శాతం ఆయుర్‌వేద, యునాని మందుల దుకాణములు చూశాము. తరువాత మా యాత్ర అసలు చూడలేదు.

చాలామంది యువత హిందీ రానందుకు ఈ ప్రాంతం అభివృద్ధి చెందలేదు అనే అంశంపై విభేదించారు. హిందీ నేర్చుకొనుట వలన మెరుగైన ఉపాధి అవకాశాలు అనేవి మంచి జీవన విధానం

వస్తుంది మిగిలి వారిలాగా అనేది వారు అంగీకరించడం లేదు. వారు ఇతర భారతీయులతో పోల్చుకుంటే చాలా అసంతృప్తితో వున్నారు. మీడియావారు చూపించే 'అనంతనాగ్'కి మేము చూసిన 'అనంతనాగ్'కి చాలా తేడా వుంది.

వేమము మజ్‌మూ పాఠశాలలో వున్నాము. మరియమ్ బేగం అనే వృద్ధ వనిత అక్కడకు రాలేని కారణంగా మేమే ఆమె దగ్గరకు వెళ్ళదలిచాము. ఆమె నివాసం 3 కి.మీ. దూరంలో కొండలలో వున్నది. ఆమెను అభినందించడానికి వెళ్ళాము. యాత్రికులము అక్కడకు చేరుసరికి ఆమె ఇంటికి తాళం వేసి వున్నది. 'బకర్‌వాల్' వంశస్తులు రెండు ఇండ్లకై పైబడి నివాసం వుంటారు. ఒకటి కొండలపైన మరొకటి కొండల క్రింద. వారి పిల్లల విద్యావకాశాల గురించి అలా చేస్తారు. 85 సంవత్సరాల వనిత మా రాక తెలుసుకొని 15 నిమిషాలలో మా వద్దకు వచ్చింది. ఆమెను అభినందించి ఆమెతో కొన్ని అంశాలు పరస్పరం చర్చించుకున్నాము. ఆమె అంతరించి పోతున్న అమూల్య వృక్ష సంపద గురించి చెప్పారు. అవి మైదాన ప్రాంతాల్లోను కొండలపైనా కూడా అంతరించి పోతున్నవని ఆమె భావనలో జమ్మూ తరువాతి భాగమంతా పంజాబ్‌లోని భాగమని ఆమె భాష కూడా ఉర్దు, కాశ్మీరీలకు దగ్గరలాగా కాకుండా కొంత పంజాబీకి దగ్గరగా వుంది. అక్కడవారు మేకపాలు వాడతారు. మేకలు దాదాపు 100 రకాల మొక్కలు తినడం వల్ల అనేక ఔషధ గుణాలు మేక పాలలో వుంటాయని వారి నమ్మకం. అక్కడ వారు వాడే చేతితో గడ్డి కోసే పరికరం విచిత్రంగా వుంటుంది. అది చెక్కతో చేయబడి వుంటుంది. దీనివల్ల గడ్డి కోసే వారికి ఎటువంటి గాయాలు కావు. అతి క్రిందనుండి కూడా గడ్డి కోయవచ్చు. యాత్రికులు ఆమె ఆశీర్వచనాలు తీసుకుని 'హనీబీనెట్‌వర్క్' యాత్రను కొనసాగించింది.

యాత్రికులు 'మజ్‌మూ'లో ఒక 'వాల్‌నట్' చెట్టు క్రింద కూర్చున్నారు. అక్కడ విద్యార్థులను వాటిని ఎట్లా పగుడకొడతారని అడిగారు. అది మామూలు తరహాకంటే కొత్తదనంగా వుండాలి. షకీల్ అనే 8వ తరగతి బాలుడు రెండు చెక్క ముక్కలతో చేసి చూపించాడు. కాని అది కూడా ఒక్క కాయను మాత్రమే పగులగొడుతుంది. అంతకంటే ఎక్కువ కాయలను పగులకొట్టాలని సవాలు విసిరాము. అప్పుడు 'షమీమా' అనే యువతి చెక్కలను పొడవుగా పెంచి స్ప్రింగ్ పెడితే కొన్ని కాయలను ఒకేసారి పగులకొట్టవచ్చని సూచించింది. అది పని చేస్తుందా లేదా అనేది ప్రశ్న కాదు. కానీ షకీల్ చేసిన దానికి యాత్రికులు నవీనత్వం వైపు 'వైరస్' అంటించారు. ఇది మున్ముందు ఖచ్చితంగా వారిపై ప్రభావం చూపి కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుంది.

హిల్లర్ అనే ప్రాంతంలో మళ్ళీ అదే చెట్టుక్రింద ప్రభుత్వ మధ్యమ పాఠశాలలో కూర్చున్నారు. అక్కడ ముస్తాక్ చే తయారు చేయబడిన చెట్లు ఎక్కే పరికరాన్ని అమితాసక్తితో గమనించారు. అక్కడ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే రూబి అనే బాలిక తనంతట తానే ఆ పరికరంతో చెట్టు ఎక్కువతానని, అక్కడ ఉపాధ్యాయులు కూడా బాలికలను బాలురతో పోటీపడమని ప్రోత్సహించారు. అక్కడి ఉపాధ్యాయులు పిల్లలను సిగ్గు పడకుండా వారికి కావలసిన అంశములు అడిగి తెలుసుకో వలసిందిగా చెప్పారు. అక్కడి ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉపాధ్యాయులకు ఈ విషయాలపై చాలా ఆసక్తి వున్నది.

'సాగం' గ్రామంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 'వాల్‌నట్' పగులగొట్టే యంత్ర నమూనా తారు చేయవలసిందిగా యాత్రీకులు కోరారు. జెస్సార్ అనే బాలుడు రెండు స్క్రూలతో డ్రమ్ము విధానంలో పనిచేసే యంత్రాన్ని సూచించాడు. ఇది శ్రీనగర్ విశ్వ విద్యాలయం ఇంజనీర్లు రూపొందించిన దానికంటే చాలా దూరంగా వుంది. కాని ఇది ముస్తాక్, డా. భట్, జెస్సార్‌లను విపులంగా మట్లాడుకోవటానికి దోహదపడింది. జెస్సార్ మదిలో చాలా ఆలోచనలు వున్నాయి. అతను వాయుపీడన శక్తితో నడిచే వాహనాలు చేయాలని సూచించినాడు. డా. భట్ గారు అతనిని తమ విశ్వ విద్యాలయంలో దీనికి సంబంధించిన విభాగానికి రావలసిందిగా ఆహ్వానించినారు. ఆయన ముస్తాక్‌ను కూడా నిశితంగా గమనిస్తున్నారు.

ఈ యాత్రలో యాత్రికులను అమితంగా ఆకర్షించింది ఏమిటంటే అక్కడి విద్యార్థుల్లోని ఉత్సాహం, విషయ వాంఛా భావన ముఖ్యంగా బాలికలలో కనిపించింది. శోధ యాత్రీకులను చలిదెబ్బను ఎలా నివారించాలి / నిలువరించాలని విద్యార్థులు అడిగారు. చాలా గ్రామాల్లో దీని బాధితులు వున్నారు. కాని శోధయాత్రీకులకు దీని గురించి అవగాహన లేదు. మత్తాన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి దన్‌శితా షారూక్ అనే యువతి తాను తన తల్లినుండి దీనికి నివారణ మార్గం నేర్చుకున్నది. ఆమె ఒక తైలం తయారు చేసే మార్గాన్ని సూచించింది. మేలు రకమైన ఆవాల జాతికి చెందిన వనమూలికలను మామూలు నూనెలో మరిగించి శరీరానికి లేపనంలా పూసినచో స్వస్థత చేకూరుతుంది. కాని ఇది అన్ని గ్రామాలకు చేరలేదు. ఈ తైలం వలన తప్పక బాధ నివారణ కలుగుతుందట. దీనిని తయారు చేయు విధానం కూడా చాలా సులభం.

శోధయాత్రికులు వెళ్ళిన ప్రతి పాఠశాలలోను 200 సం. ప్లాన్ గురించి విశదీకరించడమైనది. మన తాత, ముత్తాత మొదలు సేకరించిన పరిజ్ఞానం భావి తరాలలోని మన మనుమలు, ముని మనుమల దాకా విస్తరించే పథకానికి నాందిగా వి.కె.ఆర్.(విలేజ్ నాలెడ్జ్ రిజిష్టర్) చేపట్టడం అవశ్యమని భావించడమైనది.

ఈ వికెఆర్‌ను నేషనల్ రిజిష్టర్ ఆఫ్ గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ మరియు ట్రెడిషనల్ నాలెడ్జి / నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌తో అనుసంధానించాలని కోరడమైనది.

వనమూలికలు వాటి సంబంధిత అంశాలపై అవగాహన పెంచుకొని వాటిని క్రమమైన మార్గంలో వస్తు రూపేణా పెంపొందించాలని ఇవి కొత్త ఉపాధిని కల్పిస్తుందని, ఔత్సాహికులకు మేలు చేస్తుందని భావించడమైనది.

– అనువాదకులు : **శివప్రసాద్**

(హనీబీ సౌజన్యంతో)


చిన్న ప్రయత్నం

# గ్రామాల్లో మురుగునీటిని అరికట్టవచ్చు!

- ఉప్పుతేళ్ళ కృష్ణ, చిలకలూరిపేట

1984 వరకు మా ఊరు అంతటికి ఒకే మంచినీటి బావి. ఈ చివర నుండి ఊరి ఆ చివర వరకు పోయి శ్రమపడి మంచినీరు తెచ్చుకునేవారం. శ్రమపడి తెచ్చేవారేమో!! పొదుపుగా వాడుకునేవారు. ఇండ్లముందు మురుగు నీరు కనిపించేది కాదు.

1984 తరువాత రక్షిత మంచినీటి పథకము వచ్చింది. అవసరమున్నా లేకున్నా కృవ మోతాదులో నీరు వస్తుంది. ఈ అనవసర నీటివల్ల ఊర్లో మురుగు నీరు ఎక్కువైంది. పూర్వం దోమలు ఎరుగని మా ఊరు ఇప్పుడు దోమలకు నిలయమైంది. రాత్రిపూట దోమతెర లేకుండా నేద్రపోలేని పరిస్థితి నెలకొన్నదిప్పుడు.





ఇప్పుడు మురుగు కాల్వలలో మురుగు చేరింది. మురుగుతో పాటు నీటి తూటికాడు నీటి అమడకారు చేరింది. ఎండా కాలంలో కూడా దోమలకు మంచి ఆవాసము దొరికింది.

మొదట్లో ప్రభుత్వం వారు ఇంటింటికి తిరిగి దోమల మందు చల్లేవారు. ఇప్పుడు పరిస్థితి లేదు. మలేరియా, డెంగ్యూ లాంటి ప్రాణాంతక రోగాలకు ఈ దోమలు కారణభూతము అవుతున్నా పట్టించుకునే నాథుడు లేదు.

ఈ ప్రాణాంతక దోమల ఉనికిని అంతం చేసే మార్గం ఏమైనా వుందా అని ఆలోచిస్తే దోమలు, లార్వాలు నిలువ వుండే మురుగు కాల్వలలో మందులు చల్లి వాటిని నాశనం చేసే విధానం కన్నా అసలు మురుగునే నిలువ ఉండకుండా చేస్తే దోమలు తగ్గుతాయి అని అనిపిస్తుంది.

ఈ విధానం వలన రెండు లాభాలున్నాయి. ప్రకృతి, మందులు చేసి పర్యావరణాన్ని రక్షించటం. దోమలయందు మందుల నిరోధక శక్తి పెరగదు. దీనికి మూడు మార్గాలున్నాయి. ఒకటి ఇండ్లనుండి మురుగునీరు బయటకు రాకుండా ఇంటి ఆవరణలోనే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి ఆ నీరు అందులోనే ఇంకిపోయేట్లు చేయటం. 2. కాల్వల యందు చేరిన మురుగునీరు ఒకచోట



కాలువలో ఉన్న ఇంకుడు బోర్లు

జమ కాకుండా చూడటం. కాల్వలో నీళ్ళు ఎక్కడి కక్కడ భూమి పీల్చుకునేట్లు చేయటం. 3. ఒకచోట జమ అయిన నీటిలో దోమల లార్వాలు బ్రతికే చోట ప్రత్యేక జాతి చేపలు పెంచటము చేయవలెను. ఆస్ట్రేలియాలో ఆ పని చేయుచున్నారు.


**ఇంకుడు గుంట :**

ఇది సుమారు 4-5 అడుగుల వ్యాసార్థం కలిగి 7-8 అడుగుల లోతు కలిగి, నీటిని అధికంగా పీల్చుకునే లక్షణం కల ఇటుక ముక్కలు నల్లబొగ్గు చేత నింపబడి వుంటుంది. ఇంటినుండి వెలువడిన నీరు అంతయు ఇంటి ఆవసరణలోని ఈ గుంటయందే పీల్చబడును. ఇంకుడు గుంట పీల్చుకొనగా ఇంకా మిగిలిన నీరు కాల్వలలో చేరిన తర్వాత అక్కడ ఇంకుడు బోర్లచే పీల్చుకొనబడును.

బాపట్ల అగ్రికల్చర్ కళాశాలవారు తీర ప్రాంత నారుమళ్ళ పెంపకం దారులకోసం ఇసుక భూములలో "దొరువు టెక్నాలజీ" అని నీరు, నీటి దొరువులలో ఊరే పద్ధతి డిజైన్ చేశారు. అది బాగుగా విజయవంతం అయినది.

ఆ పద్ధతినే ఇక్కడ మురుగు నీరు అంతానికి ఉపయోగిస్తే ఈసమస్య పూర్తిగా తీరుతుందని నా ఊహ. ఇంకుడు గుంటలోనికి చేరిన నీరు బ్రాంచిలుగా చీలిన ప్లాస్టిక్ పైపుల ద్వారా చుట్టు ప్రక్కల భూమి పొరలచే పీల్చుకొనబడుట వలన మురుగునీటి సమస్య మాయం. భూమి మరలా నీటిచే రీచార్జి చేయబడుతుంది. భూగర్భ జలమట్టం బాగా (భూమి పై పొరలలో) ఉన్నచోట్ల కేవలం 150, 200 అడుగుల బోరు బావితోనే 24 గంటలు పైర్లకు నీరు లభ్యమగుచున్నది.

ప్రఖ్యాత సైంటిస్ట్ థియరీ ప్రకారం 'ప్రతి యాక్షన్‌కు ప్రతిగా రియాక్షన్ వుంటుంది' అంటే మన చేతిలో వున్న కత్తిచే ఒక ప్రాణమును తీయవచ్చు - ఒక ఆపరేషన్ చేసి ఒక ప్రాణము నిలుపవచ్చు. అలాగే బోర్‌వెల్ నుండి ప్రాణధార నీటిని తీయవచ్చు - అలాగే అనేక బోర్లు నింపుతూ ప్రాణాపాయ మురుగు నీటిని మాయం చేవచ్చు. ●





# పవార్

**ఫెయిర్ & క్యూట్ హెర్బల్ ఫేస్ ప్యాక్**

**విశిష్టతలు :**

* అన్ని వయసుల వారూ, స్త్రీలు, పురుషులు కూడా వాడవచ్చు.
* అన్ని రకాల చర్మ తత్వాల వారికి (ఆయిలీ, నార్మల్, డ్రై స్కిన్) కూడా సరిపోయే విధంగా తయారు చేయబడింది.
* 2-3 వారాల్లో మొటిమలను (పింపిల్స్), 4-6 వారాల్లో నల్ల మచ్చలను (పిగ్మెంటేషన్)ను నివారిస్తుంది.
* చర్మంపైనున్న మృత కణాలను తొలగించి, చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. సూర్యరశ్మి ప్రభావంతో చర్మం నల్లబడడాన్ని నిరోధిస్తుంది.
* చర్మపు ముడతలను (రింకిల్స్), గరుకు దనాన్ని (రఫ్‌నెస్) నివారించి చర్మానికి నిగారింపును, మృదుత్వాన్ని తెస్తుంది.
* ఇది పూర్తిగా ఆయుర్వేద మూలికలు, దినుసులచే తయారు చేయబడినది. 100 శాతం సురక్షితమైనది.
* విడిగా ఒక ప్యాకెట్ వెల రూ. 5/-. కనీసం 10 ప్యాకెట్లు (రూ. 50) తీసుకున్న వారికి పోస్టేజి / కొరియర్ ఖర్చులు మేమే భరించి పంపగలం. యం.ఓ. చేయండి

**వివరాలకు సంప్రదించండి :**

**కిషన్ పవార్,**
'పవార్' హెర్బల్స్,
2-7-24, రామ్‌నగర్,
సంగారెడ్డి పోస్ట్,
మెదక్ జిల్లా.
మొబైల్ : 94406 04348.

**లేదా**

**బ్రిగేడియర్ పి. గణేశం,**
చీఫ్ కో-ఆర్డినేటర్,
హనీబీఏపి, 103, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, హైదరాబాద్.
E-mail : honeybeeap@gmail.com

ప్రోత్సాహం


# విశాఖ సైన్స్ కాంగ్రెస్ అనుభవాలు

**- మందాజీ నర్సింహాచారి, ఇన్నోవేటర్.**

విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 3 నుండి 7 వరకు జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు నేషనల్ ఇన్నోవేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నా మూడు ప్రయోగాలైన కాలిపోయిన ట్యూబ్‌లైటును చౌక్, స్టార్టర్ లేకుండా వెలిగించడం, 2. సెల్ ఫోన్ ద్వారా ఇంట్లో దొంగలు పడితే 10 మందికి మెసేజ్ ద్వారా తెలుపడం, 3. సెల్‌ఫోన్ ద్వారా నీటి పంపును ఆన్ – ఆఫ్ చేయడం.

నాతోపాటు భూమయ్యచారి, కిషన్ పవార్ తమ ఇన్నోవేషన్లతో చేరుకున్నారు. బంగార్రాజు 'టెప్' ఆహ్వానంతో మాకంటే ముందే విశాఖ చేరుకుని మాకు తోడిచ్చారు.


అయితే మేము 15 తేది రాత్రి 2 గంటలకు నిజామాబాద్ నుండి తిరుపతి వెళ్ళే రైలులో ప్రయాణించి రాత్రి 8 గంటలకు విశాఖ చేరుకున్నాము. అక్కడ ఆంధ్రా యూనివర్సిటీలో దుర్గా ప్రసాద్ గారు (టి.ఇ.పి.పి.) మమ్మల్ని డెలిగేట్స్‌గా రిజిస్టర్ చేయించి ఆ రాత్రి అక్కడ మాకు భోజనాలు ఏర్పాటు చేసిన తర్వాత ఒక్కొక్కరికి ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేసి బస ఏర్పాటు చేశారు. 3వ తేది ఉదయం నాకు ఒక స్టాల్‌లో నా ప్రయోగాలను ఏర్పాటు చేయించారు. ఇక ఉదయం 9 గంటల నుండి మా ప్రయోగాల వివరణ ప్రారంభమైంది. అంతలోనే మన దేశ ప్రధాని గౌ. డాక్టర్ మన్మోహన్‌సింగ్,


తన ఆవిష్కరణను వివరిస్తున్న భూమయ్యచారి (ఎడమ)

రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ. వై.ఎస్. రాజశేఖర రెడ్డి మరెందరో ప్రముఖులతో పాటు నోబెల్ బహుమతి గ్రహీతలు, భారత దేశ ప్రముఖ శాస్త్రవేత్తలు మరియు దేశం నలుమూలల నుండి వచ్చిన డెలిగేట్స్, విద్యార్థులు, అధ్యాపకులు స్టేజి దగ్గర సమావేశమయ్యారు. అక్కడ ప్రధాని, ముఖ్య అతిథులు ప్రసంగించారు.

ముఖ్యంగా నోబెల్ గ్రహీత రాబర్ట్ కర్ల్ నుండి కూడా అమూల్యమైన ప్రశంసలను ఈ దొంగల పరికరం అందుకుంది. తర్వాత మా స్టాల్‌లో మేము చేరుకొని మా ప్రయోగాలను అతిథుకు వివరించడం ప్రారంభించాము. అవి ప్రారంభించిన నా ప్రయోగాల వివరణలు 7వ తేది సాయంత్రం 5 గంటల దాకా సాగినవి. ఈ పరంపరలో 6వ తేది మధ్యాహ్నం భోజనానికి కూడా వెళ్ళలేదు. భోజనం అంటే గుర్తుకు వచ్చింది అసలు అక్కడి భోజనాలు చూస్తే 5 నక్షత్రాల హోటల్‌ను తలపింపజేశాయి. ప్రతిరోజు ఉదయాన్నే అల్పాహారంగా ఇడ్లీ, మసాల ఊతప్ప, వడ, చెట్ని, సాంబారు, గ్రుడ్డు, బ్రెడ్ జామ్, కాఫీ, టీలతో ముగిసేది. మధ్యాహ్న భోజనానికి కూరలు, బిరియాని, తెల్ల అన్నము, చపాతి గుడ్డు, పలు రకాల పండ్లు, ఐస్‌క్రీమ్‌లు ఇలా అనేక రకాల ఆకర్షణలతో పాటు రోజుకొక్క కూరగాయలతో భోజనం ముగిసేది. రాత్రి భోజనాలకు ఆకు కూరలు, పప్పు, మటన్, చికన్, చేపలు ఇలా ఇంటి ధ్యాస కూడా రాకుండా


బంగార్రాజు తన ఆవిష్కరణతో ....



**సందర్శకులతో ఇన్నోవేటర్ నరసింహాచారి**

మరిపించారు.

ఇంకా మా ప్రయోగాల స్టాల్స్ విషయానికొస్తే దేశం నలుమూలల నుండి వచ్చిన అతిథులు, విద్యార్థులు మా ప్రయోగాలు, ప్రదర్శనలను చూసి ఆనందించారు. ముఖ్యంగా బంగారు రాజు ఆవిష్కరణ చాలామందిని ఆకర్షించింది. వాహనాలు వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను నివారించడానికి ఆయన తయారు చేసిన పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉందని సందర్శకులు అభినందించారు.

ఇక నా స్టాల్ విషయానికి వస్తే నా ప్రయోగాల్ని చూసిన ప్రతిఒక్కరు 'వెరీగుడ్' అని తప్ప ఇంకేమీ అనలేదు. అంతే కాకుండా చాలా ఆశ్చర్యపోయారు. అసలు ఫెయిల్ అయిన ట్యూబ్‌లైట్ ఎలా వెలుగుతుంది. అంతేకాక చౌక్, స్టార్టర్ లేకుండా అని ఆశ్చర్యపోయారు. మరొక ప్రయోగమైన దొంగలను పట్టించే పరికరం అదీ మొబైల్‌ను ఉపయోగించి.

దీనికైతే ఏ విధంగా స్పందన వచ్చిందంటే నేను సుమారు ఒక్కసారిగా 10 నుండి 15 గ్రూపులకు వివరణ ఇస్తూ వారి సెల్ ఫోన్ నెంబర్లను నా సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసి, నేను ఏర్పాటు చేసిన బీరువా లాంటి బాక్సులో వస్తువును వారిలోని ఎవరో ఒక్కరికి ఆ వస్తువు తీయించే సరికా వెంటనే ఆ మొబైల్‌కు ఎలా నా యింట్లో దొంగలు పడ్డారు వెంటనే వెళ్ళి పట్టుకోండి అనే మెసేజ్ చూసి ప్రతిఒక్కరూ ఆశ్చర్య పోయారు. ఈ ప్రయోగాన్ని చూసినవారు మరి కొందరికి చెప్పి వారిని ఈ ప్రయోగాన్ని చూడటానికి పంపడం జరిగింది.

ముఖ్యంగా ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు మాత్రం వారి మిత్రులతోనే కాకుండా ఏకంగా వారి ప్రొఫెసర్‌లను నా ప్రయోగం వద్దకు తీసుకు వచ్చి మరీ అడిగి వివరణలు సేకరించారు. దీంతో అక్కడి టివి ఛానళ్ళు, పత్రికా విలేకరులు నా ప్రయోగాలని ప్రసారం చేశారు. ప్రతిరోజు విపరీతమైన సందర్శకుల తాకిడి వల్ల అలసిపోయినా, ప్రోత్సాహకరంగా అనిపించింది.

ఇక రాత్రి సమయాల్లో విశాఖ బీచ్‌కు వెళ్ళి ఎంతో ఆనందాన్ని పొందాము. రోజంతా అలసిపోయిన మేము రాత్రి బాగా విశ్రాంతి తీసుకున్నాము.ఇలా మళ్ళీ 7వ తేది రాత్రి 10 గంటలకు బయలుదేరి ఇంటికి చేరుకున్నాము. ఇలా ఎంతో సంతోషంగా, సుఖంగా మా ఈ ప్రయాణం జరిగింది.

**నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో మన పల్లె శాస్త్రవేత్తలకు పాల్గొనే అవకాశం రావడం, మేధావులతో, హేమాహేమీల మధ్య ప్రశంసలు పొందడం ఒక అద్భుత అనుభవం. ఈమేరకు సృజనాత్మక శక్తికి ఎలాంటి హద్దులు, అడ్డుగోడలు లేవని జ్ఞానాన్ని గుర్తించడానికి సమాజమంతా ఏకమేనని మరోసారి నిరూపించబడింది. హనీబీఏపికి ఈ అవకాశం కల్పించిన డా. ఎస్. రావు, డైరెక్టర్, టి.ఇ.పి.పి., డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ గారికి మా కృతజ్ఞతలు.**

**– ఎడిటర్**

## స్పందన

ఎడిటర్ గారికి,

నేను ఈశ్వరీదేవి భక్తుడను, పూజారిని. ప్రతిరోజు చాలా నిష్ఠతో పూజలు చేస్తూ వుంటాను. నాకులము విశ్వ బ్రాహ్మణ (కంచరి) ఇత్తడి పని చేస్తూ వుంటాను. ఇపుడు ఇత్తడి నడవడం లేదు రోజు గడవడం ఇబ్బందిగా వుంది. నా వాక్శుద్ధితో అనారోగ్యంగా ఉన్న వారిని నీవు బాగుంటావు అంటే బాగుపడుతుంటారు. నా మాటతో తప్పక బాగుపడుతున్నారు. కండ్లు కనిపించని వారికి నీ కండ్లు కనిపిస్తాయని నేను అంటే చాలు వారికి కండ్లు కనిపిస్తున్నాయి. క్యాన్సర్, గుండెపోటు, కామెర్ల వ్యాధి, టిబి ఏ వ్యాధి అయినా నేను తగ్గుతుంది అంటే తగ్గిపోతుంది. నేను పూజ చేయుటకు పూజా ద్రవ్యాలకు ఇబ్బందిగా వుంది. కనుక ఆర్థిక సహాయము చేయగలరని కోరుతున్నాను.

**మీలాగే బ్రహ్మం అని కమ్మరి పని చేసే అతను తన సృజనా శక్తితో గ్యాస్‌తో నడిచే ఇస్త్రీ పెట్టెను కనిపెట్టాడు. అతనికి 'పల్లెసృజన' పేటెంట్ హక్కులను ఇప్పించి అతని ఐరన్ బాక్స్‌ను ఉత్పత్తి చేయుటకు ప్రోత్సహించి, ఆర్థిక సహాయం కూడా చేయడం జరిగింది. ఇప్పుడు అతని ఆదాయం మెరుగుపడింది. మీరూ ఇలాంటివి కనుగొంటే మాకు తెలియజేయండి, తప్పక సహాయం చేస్తాం. -ఎడిటర్**

వెలుగు బాట

## పల్లె ప్రతిభకు పట్టం

# హైదరాబాద్ హార్టికల్చర్ షో

ఉద్యానవన శాఖ (హార్టికల్చరల్) కమీషనర్ గారి ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవానికి 'హనీబీఏపి' విభాగం పాల్గొన్నవి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) వారి సహచరులకు సమాచారము పంపి, ఆహ్వానించడం జరగింది. సమాచార సమయాభావము వలన మన రాష్ట్రం నుండి 8 ఇన్నోవేటర్లు ఉత్సాహవంతులు మాత్రమే పాల్గొనడం జరిగింది.

ఈ ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం దరిదాపు 50 వేల మంది వ్యవసాయదారులను వివిధ జిల్లాల నుండి తెచ్చుటకు ప్రయత్నము జరిపినది. వ్యవసాయ సంబంధిత విషయములు చర్చించుటకు వేదికగా వివిధ విభాగములతో ఏర్పరచబడినది. 'హనీబీఏపి' విభాగము కూడా ఈ విషయ చర్చలపై రెండు విడతలుగా పాల్గొనుటకు ఆహ్వానించబడినది. ప్రథమ విభాగము 'వ్యవసాయ యంత్రీకరణ', ద్వితీయ విభాగము 'కొబ్బరి తోటల పెంపకము'.

ఉప్పుతేళ్ళ కృష్ణ గారిచే తయారు చేయబడిన వ్యవసాయ మందులను వెదజల్లు పరికరము అంధరిచేతా ఆకర్షింపబడినది. చాలా మంది వ్యవసాయదారులు వెనువెంటనే ఆ పరికరమును కొనుగోలు చేయదలిచారు. ఈ పరికరముపై ఆసక్తి పలు రకములుగా అమోఘ స్పందన లభించినది.

ఏకలవ్యుని వంటి శ్రీ రాంబాబుగారు వ్యవసాయదారులకు వారు ఎదుర్కొంటున్న ఎన్నో కఠినమైన అంశాలకు తన పరిశోధనలతో మేళవించిన అనుభవంతో గడించిన పలు అంశములు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ ప్రదర్శనలో మరొక ఆకర్షణ రాంబాబు గారి 'దొంగలను పట్టించే పరికరము'. హైదరాబాద్ నగరంలో సామాన్యమైన వ్యక్తి తన ఇంట్లో 'దొంగల దోపిడీ' బారినుండి కాపాడే యంత్రాన్ని ఈ ఉత్సవానంతరం రూ. 1000/-లతో ఏర్పాటు చేసుకొని చూశాడు. అతని ఎంతో సంతృప్తి చెందడం జరిగింది. అంతేకాదు ఈ పరికరం పట్ల ఎందరో వ్యాపారస్తులు నెలకు 250 నుండి 300 పరికరాలను పంపిణీ చేయడానికి ఆహ్వానాలు అందుతున్నాయి.

ప్రస్తుతమున్న విద్యుత్తు, రైతుల పాలిట ఎంత ఇబ్బందికరంగా వుందో ప్రతి రైతుకు తెలిసిందే. ఏ అర్ధరాత్రో కరెంటు వస్తే ఆ రాత్రి సమయంలో మోటరు వద్దకు వెళ్ళి ఆన్ చేయటం వల్ల ఎన్నో ఇబ్బందులు, అపాయాలను ఎదుర్కొంటున్న విషయం విదితమే. ఈ సమస్యల నుండి రైతును ఆదుకోవాలన్న తలంపుతో రాజలింగం గారి పరిశోధన పలువురు వ్యవసాయ దారులను ఎంతగానో ఆకర్షించింది. ఎంత దూరం నుండైనా 'సెల్‌పోన్' ద్వారా మోటర్ ఆన్ చేయటం దీని ప్రధాన అంశము. ఈ పరికరాన్ని ఎంత తొందరగా వీలైతే అంత త్వరగా మార్కెట్‌లో వుంచాలని ఎంతోమంది రైతులు మాపై వత్తిడి తెచ్చారు. ఇందులోని ప్రత్యేకత మనం ఎంత దూరం నుండైనా మోటారు ఆన్ చేయడం కాని, ఆఫ్ చేయడం కాని చెయ్యవచ్చు.

ఈ ప్రదర్శనలో ఇంకా చంద్రశేఖర్ గారి 'శ్రీశైలము' విశేష ఆదరణ పొంది దాదాపు 30 సీసాలు అమ్ముడు పోయాయి. నరసింహాచారి గారి కాలిపోయిన ట్యూబ్‌లైట్‌ను వెలిగించే సాధనం కూడా ఎంతో ఆదరణ పొంది ఈ ప్రదర్శనలోనే 275 పరికరాలను అమ్మటం జరిగింది.

కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామానికి చెందిన వెంకట కృష్ణుడుచే పరిశోధించి తయారు చేయబడిన 'సంజీవిని' అనే రసాయన మందు మొక్కల ఆరోగ్య విషయంలో పలువురిచే గుర్తించబడినది. ఈ ప్రదర్శనలో ఇతను కూడా 34 సీసాల మందును విక్రయించడం జరిగింది. అంతే కాకుండా 'మ్యాట్రిక్స్' అనే సంస్థ దీన్ని పంపిణీ చేయటానికి అమితాసక్తిని ప్రదర్శించు






చున్నది. త్వరలోనే దీనికి పేటెంట్ హక్కును ఇప్పించి, మ్యాట్రిక్స్ సంస్థ ద్వారా పెద్దయెత్తున ఉత్పత్తిని ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తెచ్చే అవకాశముంది.

ఇంకా ఎన్.ఐ.ఎఫ్. వారిచే పంపబడిన వ్యక్తి కొబ్బరి చెట్టును ఎక్కే యంత్రాన్ని కూడా పలువురు రైతులు వీక్షించడం జరిగింది. ఇద్దరు వ్యక్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా అనిపించి తమకు ఈ పరికరం కావాలనటంతో వారికి పంపడం జరిగింది.

ఉద్యానవన ప్రదర్శనలో 'పల్లెస్పృజన' పత్రికకు 64 మంది సంవత్సర చందాదారులుగా చేరటం జరిగింది. వారినుండి రూ. 6,400లు చందాగా స్వీకరించడం జరిగింది. ఈ ప్రదర్శనలో సంచికల విక్రయం ద్వారా రూ. 1,380లు సేకరించడం జరిగింది.

రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి శ్రీ రఘువీరా రెడ్డి గారు ఈ ప్రదర్శనలో 300 స్టాల్సు వుండగా మన స్టాల్ వద్దనే దాదాపు అరగంట సమయాన్ని గడిపి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా, ఆసక్తిగా అడిగి వివరాలను సేకరించడం, హనీబీఏపి వారిని తన కార్యాల యానికి వచ్చి ఇతర అంశముల పరిశీలనకు ఆహ్వానించడం కూడా జరిగింది.

మన చిరు విభాగమును పలువురు పెద్దలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయదారులు, పంపిణీదారులు, సామాజిక విద్యావంతులు అత్యంత ఆసక్తితో సందర్శించడం జరిగింది.

అత్యంత సంతోషదాయకమైన విషయమేమిటంటే మన సముదాయాన్ని ప్రదర్శనకు వచ్చిన చాలామంది ఆఖరి నిమిషయం వరకు ఆసక్తితో గమనించడం. ఈ ప్రదర్శన ద్వారా ఎన్ఐఎఫ్ వారు పంపిణీ చేసిన 6వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ పోటీల కరపత్రాలు కొన్ని వేల మందికి చేరినవి.

పి. శ్రీనివాస్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి అనుసంధాన సహాయక చర్యలకు వివిధ పరికరముల రవాణా సౌకర్యములు, వసతి సౌకర్యములను ఏర్పాటు చేయటం వల్లే హనీబీఏపి విజయవంతంగా పాల్గొనడం జరిగింది.

సింగరేణి కాలరీస్ సంస్థ తరుపున అధికారులు శ్రీ దయానంద్, శ్రీ చంద్రకాంత్ శర్మ గార్ల సహకారం అమూల్యం.

మన హనీబీఏపి విభాగమునకు శ్రీ దుర్గాప్రసాద్, శ్రీ క్రాంతికిరణ్, శ్రీ చంద్రకాంత్ శర్మ గార్లు మూల స్తంభాల వలె నిలిచి ఈ ఉత్సవాన్ని జయప్రదంగా నడిపించడం జరిగింది. ఒక్క రోజులోనే ఈ ప్రదర్శనకు కావలసిన తనవంతు సహకారాన్ని అతి తక్కువ మూల్యంతో అందించిన 'నరేంద్ర గ్రాఫిక్స్' అధినేత శ్రీ వీరరాఘవ రెడ్డి గారికి హనీబీఏపి కృతజ్ఞతలు.

'మ్యాట్రిక్స్' సంస్థ మరియు ఇన్నోవేటర్లు సంప్రదించుకున్నారు. తదుపరి డా. రమేష్ చౌహాన్ గారు 'సంజీవిని' పంపిణీ చేయుటకు అంగీకరించారు. సంజీవిని వారి విలువలకు అనుగుణంగా వుందని కొనియాడారు.

ఈ ఉత్సవంలో పాల్గొనడం చాలా ఉత్కంఠం, ఉత్సాహభరితంగా వున్నది. మాతోటి సహచర వర్గం ఈ ప్రదర్శనఒక కిటికీ వంటిదని ఆంధ్రప్రదేశ్‌లోని ఇన్నోవేటర్లు మరియు వ్యవసాయదారుల మధ్య ఒక నూతన బంధం ఏర్పడినట్లుగా భావించడ మైనది.

ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి హనీబీ ఆంధ్రప్రదేశ్ తరుపున అనుసంధానకర్త శ్రీ పి గణేశం (బ్రిగేడియర్) గారు మూల ఔత్సాహికులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ సాధారణ విభాగము ఒక గొలుసువలె మూల ఔత్సాహికుల సృజనాత్మకతను వారియొక్క ఆవిష్కరణలను అనుసంధానించడం జరుగుతున్నది. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజానీకంతో ప్రారంభం మాత్రమే. మా ఉద్దేశ్యంలో ప్రజల స్పందన చాలా వినియపూర్వకంగా అతి ఉత్సాహ వంతంగా కనిపించింది. పలువురు మూల ఔత్సాహికులు తక్షణమే వెలుగులోకి తేబడటం జరిగింది.

వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ తలపెట్టిన ఈ ప్రదర్శనలో హనీబీఏపి తరుపున మన ప్రదర్శన విజయవంతంగా ప్రదర్శించడం జరిగిందని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.


– కో–ఆర్డినేటర్, హనీబీఏపి.



సందర్శకులతో నరసింహాచారి....



స్ప్రేయర్‌ను ప్రదర్శిస్తున్న కృష్ణ



సందర్శకులతో హనీబీఏపి స్టాల్

# స్పందన

ఎడిటర్ గారికి,

"పల్లెసీమలు దేశ ప్రగతికి పట్టుకొమ్మలు" అని పెద్దలు చెప్పిన విషయాన్ని నిజం చేస్తూ తెరచాటున అభివృద్ధి చెందుతున్న పల్లె ప్రతిభను వెలుగులోకి తీసుకొని వస్తున్న 'పల్లెసృజన' త్రైమాసిక పత్రిక – పత్రికా రంగంలో ఒక నూతన ఒరవడి సృష్టిస్తోంది.

వివిధ దేశీయ, విదేశీయ ప్రసార సాధనాలు ఆధునిక సమాచారాన్ని అందివ్వడంలో పోటీ పడుతున్న ఈ తరుణంలో, వాటికి ధీటుగా వారికి కూడా తెలియని, అంతుచిక్కని వివిధ పరిశోధనల సమాచారాన్ని సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యే రీతిలో, సులభ శైలిలో నిత్య దైనందిన జీవితంలోని విద్యా, వైద్య, వైజ్ఞానిక విషయాలను ఈ పత్రిక ద్వారా తెలియజేయడం చాలా సంతోషం.

పత్రికా రంగంలో చిరు ప్రాయంలో ఉన్న పుత్రిక, స్థాయిని మించిన సమాచారాన్ని అందించడంలో మీరు చేస్తున్న నిస్వార్థమైన కృషికి 'పల్లెసృజన' పత్రికా సంపాదకీయ వర్గానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేయుచున్నాను.

ఈ పత్రిక దినదిన ప్రవర్థమానమైన అందిరికి అందుబాటులో అనువైన పరిస్థితులను కల్పించగలదని ఆశిస్తున్నాను.

**- డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్,**
**చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్,**
**ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్, తనుకు, పశ్చిమ గోదావరి జిల్లా.**

సంపాదకులకు నమస్కరించి వ్రాయునది,

ఆర్యా, మీరు పంపిన 'పల్లెసృజన' త్రైమాసిక పత్రిక జులై–సెప్టెంబర్ 07 సంచిక ఈరోజే నాకు ముట్టినది. ఎప్పటిలాగే గ్రామీణ ప్రజానీకం ద్వారా ఇతర వ్యక్తుల పరంగా ఆవిష్కృతమైన సృజనశీల అంశాలను, ఇతర విశేషాలను చక్కగా ముద్రించి ప్రచురించారు. అందుకు నా అభినందనలను ఆనందంగా అందిస్తున్నాను.

అన్నిటితో పాటు నేను బెల్లం నిల్వపై వ్రాసి పంపిన వ్యాసాన్ని కూడా ప్రచురించి మీ (మా) పాఠక లోకానికి అందించినందుకు ధన్యవాదములు. అయితే నేను సంపాదకులకు ఆంగ్లంలో వ్రాసిన అభినందన లేఖ ముద్రించటం లో చిన్న పొరపాటు దొర్లింది. లేఖ రెండవ వరుసలో 'అభినందనీయం' అనే అర్థం వచ్చే మాటకు బదులుగా 'గర్హనీయం' అని పడింది. గమనించగలరు. పత్రిక ద్వారా మీ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు దేశానికంతటికీ మీరు అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ హనీబీ యంత్రాంగానికి నా అభినందనలు తెలియ జేస్తున్నాను.

**– పి.వి. సూర్యప్రకాశరావు,**
టెక్నికల్ అడ్వయిజర్,
ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్
(ప్రియ ఫుడ్స్ డివిజన్), హైదరాబాద్.

ఎడిటర్ గారికి,

గత సంచికలో 10 హెచ్.పి. ట్రాక్టరు గురించి చదివాను. అట్టి ట్రాక్టరు గురించి వీడియో సిడి గురించి వ్రాసినారు. తమరు సి.డి. పంపితే పోస్టులో విడిపించుకోగలను.

**– పి. హన్మంత రెడ్డి,** అన్నారం,
నిజామాబాద్ జిల్లా.

ఎటిటర్ గారికి,

గత సంచికలో ప్రచురించిన 10 హెచ్.పి. ట్రాక్టరుకు సంబంధించిన సి.డి. పంపగలరు.

**– జి. జయప్రకాష్ రెడ్డి,** హన్మకొండ.

ఎడిటర్ గారికి,

10 హెచ్.పి. ట్రాక్టరు వీడియో సి.డి. మరియు పల్లె సృజన మా డైరీ తెలుగు దినపత్రిక కొరకు కాంప్లిమెంటరీగా పంపగలరా?

**– మాదాసు అజయ్, శేషకుమార్,**
చింతలపూడి.

**సి.డి.లు తప్పకుండా అందరికీ త్వరలో పంపుతాము, పల్లె సృజన అతి కష్టంమీద ముద్రించబడుతున్న విషయం మీకు ఇప్పటికే అర్థమై వుంటుంది. కాంప్లిమెంటరీ కాపీలు అడగడం ధర్మమేనా?! ఈ పత్రిక ముఖ్యంగా పల్లె ప్రజలకు అందుబాటులో వుండాలని వార్షిక చందా కేవలం రూ. 100/– లకే అందజేస్తున్నాం**

– ఎడిటర్.

ఎడిటర్ గారికి, 6వ ద్వైవార్షిక పోటీల వివరాలు మ సమాఖ్యకు పంపగలరు.

**– మాదాసు పుల్లారావు,** చింతలపూడి

**ఈ పత్రిక చివరి కవర్ పేజిలో అన్ని వివరాలు ఉన్నవి. మీవద్ద ఏదైనా ఇన్నోవేషన్ వుంటే తప్పక వ్రాసి పంపండి. పరిశీలిస్తాం. – ఎడిటర్**

## <u>పల్లె ప్రజల నేస్తం సైకిల్</u>

# గ్రామీణ ఆవిష్కర్తల వినూత్న ప్రయోగాలు





### ఎద్దులు లేకుండా సైకిల్‌తో చేను దున్నేస్తే!

గోపాల్ అనే రైతు తన ఆలోచనతో సైకిల్ ముందు భాగంతో రూ. 1,000/–ల నుండి రూ. 1,200/–ల వరకు ఖర్చు చేసి ఒక నాగలి (వీడర్)ను అతికించి సైకిల్‌తో తన నేలను దున్నుటకు ఉపయోగిస్తున్నాడు. ఈ నాగలితో గట్టి నేలను కూడా చక్కగా చదును చేస్తున్నాడు. గోపాల్ అంతటితో ఆగక తాను కనుగొన్న ఈ సైకిల్ నాగలికి లూనా – మూపెడ్‌కు చెందిన మోటార్ అతికించి ఎక్కువ శ్రమ లేకుండా పొలాన్ని ఇంకా తొందరగా దున్నటానికి ప్రయత్నాలు చేస్తున్నాడు.


పల్లెల్లో వ్యవసాయ కూలీల ఇబ్బంది ఉన్నచోట, ఎద్దుల ఖరీదు భరించలేని వారు ఇలా చేసుకుంటే బాగుంటుంది కదూ! దీనికింకా మీరేమైనా మెరుగులు దిద్ది ఉపయోగించుకోగలరేమో ఆలోచించండి!!!

### ఎగుడు దిగుడు గుంటల్లో కూడా సైకిల్‌పై సాఫీగా వెళ్ళవచ్చు





సైకిల్ ఎక్కువగా తిరిగే అవసరమున్న కనకదాసు అనే ఓ గ్రామవాసి కనుగొన్న చిట్కా ఇది. సైకిలు వేగంగా పోవునపుడు గుంటలు, ఎత్తు పల్లాల నుంచి చక్కగా తప్పించుకుని సాఫీగా ప్రయాణం చేయటానికి గాను, సైకిల్ సీటుకు 'స్ప్రింగ్'లను అనుసంధానం చేసి తొక్కడం ద్వారా ఈ అసౌకర్యాన్ని అధిగమించాడు. ఇప్పుడు సాఫీగా 'షాక్ అబ్జార్బర్' వున్న మోటార్ సైకిల్‌పై ఎంత సాఫీగా వెళ్తామో అలా వెళ్తున్నానంటాడు కనకదాసు.



### నేలపైనే కాదు నీటిపై కూడా సైకిల్ తొక్కవచ్చు !

సైకిల్‌కు వెనక చక్రం పక్కలో రెండు వైపులా రెండు దోరినెల్లాంటి పరికరాల్ని అమర్చి (ఇవి అతి తేలికగా వుంటాయి) వాటిని తీసిపెట్టవలసిన అవసరం లేకుండా నేలపై సైకిల్ తొక్కుతూ అలాగే నీటిపై కూడా ప్రయాణం చేయడం కొరకు తాను స్వంతంగా తయారు చేసుకున్నాడు సైదుల్లా అనే ఈ గ్రామీణ ఇన్నోవేటర్.

### సైకిల్‌తో కూడా పొలానికి నళ్ళను పారించవచ్చు !



తన పొలానికి నీళ్ళు కావాలంటే అక్కడ కరెంటు లేదు. కరెంటు కనెక్షన్, మోటార్ కొనే శక్తి లేని ఈ రైతు తన సైకిల్‌తో పొలానికి నీళ్ళు పారిస్తున్నాడు చూశారా! 5 హార్స్‌పవర్ ఇంజన్ యొక్క నీటి పంపుసెట్‌ను సైకిల్‌కు ఒక పుల్లీ ద్వారా అనుసంధానం చేసి తను సైకిల్ తొక్కడం ద్వారా నీటిని తోడి పొలానికి సరఫరా చేస్తున్నాడు. భలేగుంది కదూ! దీని ఖర్చంతా కేవలం రూ. 3,0000/–లు మాత్రమే సుమా!!!

# గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

**ఈ పోటీలు ఎందుకు? :** మన సమాజంలో దాగివున్న సృజనా శక్తిని వెలుగులోకి తెచ్చి, తద్వారా గ్రామీణ ప్రజల జీవన స్థాయిని పెంచాలన్న తపనే ఈ పోటీకి మూలం.

**ఎవరు పాల్గొనవచ్చు?:** ★ వృత్తిపరంగా, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల అనుభవం లేకుండా, తమ తమ వ్యక్తిగత స్థాయిలో వినూత్న ఆవిష్కరణలు సాధించిన వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు, సమాజాలు. – మహిళలు, మహిళా సమూహాలు పాల్గొనవచ్చు. – విద్యార్థులు, యువకులు వినూత్న విషయాల్ని ఆవిష్కరించినవి పంపవచ్చు. – గ్రామాల్లోని రైతులు, వృద్ధులు, అనుభవజ్ఞులు, పంటలకు, పశువులకు, ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగ సాఫల్యం అయిన ఆలోచనలను, ప్రక్రియలు పంపవచ్చును.

ఎలాంటివి పంపవచ్చు? ★ ఆవిష్కరణలు ఉత్పత్తులను పెంచే విషయంలోను, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేవిగానూ, వ్యవసాయ పరంగా రైతులు లాభదాయకంగా ఉండే పద్ధతులూ,ఆలోచననలు ఆవిష్కరణలు ఈ పోటీకి పంపవచ్చు – ప్రకృతిలో లభించే చెట్లు ఆకులు, బెరడు, మొక్కల ద్వారా మనుష్యులకు, పశు సంతతికి, పంటలకు లాభాన్నిచ్చే ఆలోచనలు, ప్రయోగాలు పంపవచ్చు.

**ఎలాంటివి పంపవచ్చు? :** ★ వ్యక్తులు లేదా బృందాలు ఎన్ని ఎంట్రీలైనా పంపించవచ్చు. తెల్ల కాగితంమీద ఈ క్రింది వివరాలను నమోదు చేయడం అవసరం. 1. నూతన ఆవిష్కరణ విశిష్టత సంప్రదాయ విజ్ఞానం గురించిన వివరాలు, 2. నూతన ఆవిష్కరణకు దారితీసిన నేపథ్యం. 3. నూతన ఆవిష్కరణల్ని ఆవిష్కరించిన వ్యక్తుల నేపథ్యం. వారి విద్యార్హతలను గురించిన పూర్తి వివరాలు, వీటితోపాటు ఒక ఫొటో గ్రాఫ్, వీలైతే అదనపు సమాచారంలో కూడిన వీడియోలు.

మొక్కలకు సంబంధించిన వారాలతో కూడిన ఎంట్రీలను కూడా పంపించవచ్చు. అయితే ఈ మొక్కల ఎండు భాగాల్ని ఎండు భాగాలను నమూనాలుగా పంపిచవలసి ఉంటుంది.

| బహుమతుల కేటగిరి | బహుమతి (రూపాయలు) | | |
|---|---|---|---|
| | ప్రథమ | ద్వితీయ | తృతీయ |
| ★ తమ వృత్తులు నిర్వహించడానికి వినూత్న పద్ధతులను కనుగొన్నవారు వారి వృత్తులకు సంబంధించిన పరికరాలు, పనిముట్లు, యంత్రాలు వృత్తి సులభతరం చేసే ప్రయోగాలు కనుగొన్నవారు | ఒక లక్ష | 50 వేలు | 25 వేలు |
| ★ విద్యార్థులు | 15 వేలు | 10 వేలు | 5 వేలు |
| ★ పరిశోధనలను వెతికి వెలుగులోకి తేవడానికి అసాధారణ కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు | 25 వేలు | 10 వేలు | – |
| ★ ఔషధ మొక్కల గొప్పతనాన్ని తెలియజేసినవారు | 50 వేలు | 25 వేలు | 15 వేలు |

★ అర్హులైన ఎంట్రీలకు ప్రశంసా పత్రాలు ఇవ్వబడును. ★ అసాధారణ ఆవిష్కరణలను 'హనీబీ' మరియు అన్ని ప్రాంతీయ పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. ఎన్.ఐ.ఎఫ్. వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.

**పాల్గొనుటకు ఆఖరు తేది :** రెండు సంవత్సరాలకోసారి నిర్వహింపబడు ఈ పోటీలో పాల్గొనుటకు చివరితేది 31 డిసెంబర్ 2008. ఇప్పటివరకు ఇలాంటివి 5 పోటీలు నిర్వహింపబడినవి. ఇది ఆరవ పోటీ.

ఎంట్రీలు పంపువారు తమ పూర్తి చిరునామా వివరంగా వ్రాయాలి. అందువల్ల భవిష్యత్తులో ఉత్తర ప్రత్యుత్తరాలకు వీలవుతుంది. "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (NIF) వెబ్‌సైట్ www.nifindia.orgలో మిగతా వివరాలను పొందవచ్చును.

**ఎంట్రీలను పంపవలసిన చిరునామా :**
National Co-ordinator,
(Scouting and Documentation)
National Innovation Founation,
Satellite Complex, Bunglow No. 1,
Premchand Road, Jodhpur Tekra,
Ahmedabad - Gujarat - 380 015.

**వివరాలకు సంప్రదించండి :**
A.P. State Co-ordinator,
(Scouting and Documentation)
HONEYBEEAP, 102, Vayupuri,
Sainikpuri Post, Hyderabad - 500 094.
Ph.: 040-27118555, Mobile : 98660 01678.
E-mail : honeybeeap@gmail.com